PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 157 Vol No | విజయవాడ, బుధవారం 8 జనవరి 2025 Vijayawada, Wednesday 8 January 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50 Rs

పేపర్‌మిల్లు లాకౌట్ ఎత్తివేత సమ్మె విరమించిన కార్మికులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఎపి పేపరు మిల్లు యాజమాన్యం లాకౌట్‌ను బుధవారం ఎత్తివేసింది. దీంతో కార్మికులు సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మెను విరమించారు. అధికార యంత్రాంగం, యాజమాన్య ప్రతినిధులతో జరిపిన చర్చలు సఫలం కావడంతో యాజమాన్యం లాకౌట్ ఎత్తివేసేందుకు అంగీకరించింది. మంగళవారం ఉదయం నుంచి కార్మికులు విధులకు హాజరయ్యారు. పలు సమస్యలపై ఎపి పేపరు మిల్లులో కొంతకాలంగా 11 కార్మిక సంఘాలు దశల వారీగా ఆందోళనలు చేస్తున్నాయి. చర్చలు విఫలమవడంతో ఈ నెల 2 నుంచి కార్మికులు సమ్మె చేపట్టారు. యాజమాన్యం సోమవారం ఉదయం లాకౌట్ ప్రకటించింది. జెసి ఎస్ చిన్నరాముడు, కార్మిక శాఖ అధికారి రాణి యాజమాన్య ప్రతినిధులతో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ దశల వారీగా చర్చలు జరిపారు. హైలెవెల్ కమిటీతో యాజమాన్యం, కార్మిక సంఘాలు కలిసి చర్చించుకుని వారి సూచనల మేరకు 1.7.2020 నుంచి 31.12.2023 వరకూ సంబంధించిన వేతన ఒప్పందం సానుకూలంగా చేసుకునేందుకు ఉభయులూ అంగీకరించారు. ఈ వివాదం లేబర్ కోర్టుకు రిఫర్ చేసినందున యాజమాన్యం, కార్మిక సంఘాలు వేతన సవరణ చర్చల అనంతరం కేసును ఉపసంహరించేందుకు అంగీకారం కుదిరింది. సమ్మెలో పాల్గొన్న వారిపై ఎటువంటి కక్ష పూరిత చర్యలు ఉండబోవని స్పష్టం చేశారు. ఈ చర్చల కాలంలో ఎటువంటి సమ్మెలు, ఆందోళనలు యాజమాన్యం ఎటువంటి లాకౌట్లు ప్రకటించకూడదని ప్రతిపాదించారు.

సిఐటియు, ఎస్‌డబ్ల్యుడబ్ల్యుఎ అభ్యంతరం

యాజమాన్యం ప్రతిపాదనను సిఐటియు, ఎస్‌డబ్ల్యుడబ్ల్యుఎ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశం ఎప్పటికి నిర్వహిస్తుందో గడువును తెలపాలని, ఈ విషయాన్ని మినిట్స్‌లో పొందుపరచాలని కోరారు. దీనిపై స్పష్టత ఇవ్వలేదని, చర్చల కాలంలో ఎటువంటి సమ్మెలు, ఆందోళనను నిర్వహించరాదని యాజమాన్యం ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

నందిగంకు బెయిల్ నిరాకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ ఎంపి నందిగం సురేష్‌కు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించింది. మరియమ్మ హత్య కేసులో హైకోర్టు బెయిల్ నిరాకరించడంతో సురేష్.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేసిన నేపథ్యంలో తాము జోక్యం చేసుకోలేమని, ట్రయల్ కోర్టుకు వెళ్లాలని ధర్మాసనం సూచించింది.

డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు, పోస్టింగ్స్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పలువురు డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు, పోస్టింగులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం జిఓ ఆర్‌టి నెంబరు 34ను విడుదల చేసింది. ఇటీవల పలువురు ఐఎఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం తాజాగా 17 మంది డిప్యూటీ కలెక్టర్లలో కొందరిని బదిలీ చేయగా, పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న మరికొందరికి పోస్టింగులు ఇచ్చింది.


అవినాష్ పిఎను విచారించిన పోలీసులు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డిని పులివెందులలోని ఆయన నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైకోర్టు ముందస్తు బెయిల్ తిరస్కరించడంతో పులివెందులలోని ఆయన ఇంటికి వెళ్లి పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తొమ్మిదిన విచారణకు రావాలని రాఘవరెడ్డికి నోటీసులు ఇచ్చి పంపించారు. వర్రా రవీంద్రారెడ్డి కేసులో రాఘవరెడ్డిపై అర్బన్ పోలీసుస్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల దర్యాప్తు అధికారిగా పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ వ్యవహరిస్తున్నారు. రాఘవరెడ్డిని పోలీసులు అరెస్టు చేస్తారన్న ప్రచారంతో వైసిపి కార్యకర్తలు భారీగా స్టేషన్‌కు చేరుకున్నారు.

రాజ్యాంగ పరిరక్షణకై పోరాటానికి సన్నద్ధం

- ఎం.ఎ బేబి పిలుపు



"రాజ్యాంగం మనకేమిచ్చింది" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎం.ఎ బేబి తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యాంగ పరిరక్షణకై పోరాటానికి ప్రజలు సన్నద్ధం కావాలని కేరళ మాజీ విద్యా శాఖ మంత్రి ఎం.ఎ బేబి అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో రామోజీరావు సాహిత్య వేదికపై మంగళవారం సాయంత్రం ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రచురించిన "రాజ్యాంగం మనకేమిచ్చింది" అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం '75 ఏళ్ల భారత రాజ్యాంగం' అంశంపై మాట్లాడారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు మన రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని తమ రాజ్యాంగాలను రూపొందించుకున్నాయని, ఇక్కడేమో మన రాజ్యాంగంపై కొన్ని శక్తుల దాడులు చేస్తున్నాయని అన్నారు. జస్టిస్ హెచ్.ఎన్.నాగమోహన్‌దాస్ రాజ్యాంగంలోని కీలక అంశాలను గురించి ఈ పుస్తకంలో వివరించారని చెప్పారు. రాజ్యాంగ రూపకల్పనకు ఏర్పాటు చేసిన కమిటీలో మనువాదులు దేవుడి పేరుతో రాజ్యాంగాన్ని ప్రారంభించాలనే అంశాన్ని తీసుకువచ్చారని, మెజారిటీ సభ్యులు రాజ్యాంగాన్ని 'పీపుల్ ఆఫ్ ఇండియా' అనే పదంతోనే ప్రారంభించాలని నిర్ణయించారని గుర్తు చేశారు. మనుసకృ్మతిని ఆమోదించలేదు కాబట్టి ఈ రాజ్యాంగం పనకిరాదంటూ అప్పట్లో ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక ఆర్గనైజర్ వ్యాసాలు ప్రచురించిందని చెప్పారు. అలహాబాద్ హై కోర్టు న్యాయమూర్తి శేఖర్ యాదవ్ విహెచ్‌పి కార్యక్రమంలో పాల్గొని, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడ్డం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఈ విషయంపై సిపిఎం నాయకులు బృందాకారత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారని చెప్పారు. అయోధ్య కేసు విషయంలో కూడా సుప్రీం కోర్టు తీర్పులోని అనేక అంశాలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నాయన్నారు. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పుల్లో కొన్ని వివాదాస్పదంగా ఉన్నాయని, జస్టిస్ డివై చంద్రచూడ్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం ఇచ్చిన అయోధ్య కేసులో తీర్పు ప్రతి కింద ఆథర్ అని పేర్కొనలేదని అన్నారు. ఈ కేసులో తీర్పు ఇవ్వడమే జరిగింది తప్ప న్యాయం జరగలేదని అన్నారు. సుప్రీం కోర్టు రాజ్యాంగబద్ధంగా ఏర్పడిందని, దానికి రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. బాబ్రీ మసీదును కూల్చడం నేరం, కూల్చిన వారు నేరస్తులు, కానీ, కోర్టు వారికే ఆ స్థలాన్ని అప్పగిస్తూ తీర్పు ఇచ్చిందని అన్నారు. అధికార పార్టీకి అత్యధిక మెజారిటీ ఉన్నప్పుడు పార్లమెంట్ రాజ్యాంగాన్ని కాపాడటంతో విఫలం కావచ్చు, కానీ, జుడిషియరీపై రాజ్యాంగాన్ని కాపాడాల్సి బాధ్యత ఉందన్నారు. రాజ్యాంగం మనకేమిచ్చింది పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని, బంధుమిత్రులకు బహుకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి జెబవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సంపర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ప్రజాశక్తి బుక్ హౌస్ జిఎం కె.లక్ష్మయ్య, విశాలాంధ్ర బుక్ హౌస్ జిఎం మనోహర్ నాయుడు, ప్రజాశక్తి బుక్ హౌస్ మేనేజర్ బి.శ్రీనివాస్, వర్కింగ్ ఎడిటర్ వరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దళిత సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- 10 నుంచి 30 వరకు దళితవాడల్లో సర్వే
- ఎపి వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు



దళిత సమస్యలపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. దళితుల సమస్యలపై ఈ నెల 10 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా దళితవాడల్లో సర్వే చేపట్టనున్నామని చెప్పారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం స్థానిక ఉద్దరాజు రామం భవనంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా దళితుల సమస్యలపై విస్తృతంగా చర్చించామని, దీనిపై వెంటనే ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. దళితులపై దాడులు, అత్యాచారాలు, వివక్ష, అంటరానితనంపై రాష్ట్రవ్యాప్తంగా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఉద్యమం చేపడుతున్నట్లు వివరించారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా దళితులను, ప్రజలను అవమానపరిచినట్లుగా ఉన్నాయన్నారు. బిజెపి మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో అన్ని ప్రజాసంఘాలు ఈ ఉద్యమంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల కోసం రానున్న కాలంలో ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా యాత్రలు, పర్యటనలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. భూమి, ఉపాధి హామీ, దళిత, గిరిజనుల సమస్యలపై రానున్న మూడు నెలల్లో ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం కోసం ఒక ప్రణాళికను తయారుచేసి ప్రజల ముందుకు తీసుకొస్తామని తెలిపారు. లౌకికతత్వాన్ని కాపాడడానికి జరిగే ఉద్యమంలో ప్రజాస్వామ్యవాదులంతా కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు ఎ.రవి, తామా ముత్యాలమ్మ, పి.రామకృష్ణ, ఎస్.మహంకాళిరావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి నాటికి విసిల నియామకాలు

- సమీక్షలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



విసిలు, అడ్వయిజరీ కౌన్సిల్ నియామకాలను మార్చి నాటికి పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. 2025-26 విద్యా సంవత్సరంలో కెజి నుంచి పిజి వరకు పాఠ్యప్రణాళిక సమూల ప్రక్షాళనపై ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్సిటీల్లో హాస్టళ్ల పనితీరును మెరుగుపర్చేందుకు వెబ్‌బేస్డ్ మెనూ, సూచన బాక్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యూనివర్సిటీల్లో 36 శాతంగా ఉన్న గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌ను 50 శాతానికి పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో ఏర్పాటయ్యే సలహామండలి సభ్యుల ఎంపికలో విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, స్టేక్ హోల్డర్లు, పాలసీ నిపుణులు, రీసెర్చ్ నిపుణులకు స్థానం కల్పించాలని ఆదేశించారు. పాఠశాల విద్య స్థాయిలో బాలలకు పుస్తకాల భారం తగ్గించి నాణ్యత పెంచేలా నూతన పాఠ్యప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఒకే పుస్తకంలో రెండు సెమిస్టర్ల పాఠ్యాంశాలు ఉండేలా పరిశీలించాలన్నారు. డిఎస్‌సిని పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్‌లో మేథ్స్, బోటనీ, జువాలజీ ఒకే పేపర్ ఉండేలా మార్పులు చేయడంపైనా, సిబిఎస్ఇలో మాదిరి ఇంటర్నల్ మార్కుల విధానం అమలుపైనా, పాఠశాల విద్యలో డిజిటల్ ఎసెస్‌మెంట్ విధానం అమలు అవకాశాలపైనా చర్చించారు. జిఓ 117కు ప్రత్యామ్నాయం విషయంలో ఎమ్మెల్యేలు, పాఠశాల యాజమాన్యాల కమిటీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కళాశాల విద్య డైరెక్టర్ నారాయణభరత్ గుప్తా, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె మధుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ సమక్షంలో రెండు ఒప్పందాలు

రాష్ట్రంలో విండ్ ఎనర్జీ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం కోసం సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్, ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎస్ఎస్‌డిసి) మధ్య మంత్రి లోకేష్ సమక్షంలో ఒప్పందం కుదిరింది. సుజాలన్ సహకారంతో యాంత్రిక, ఎలక్ట్రికల్, బ్లేడ్ టెక్నాలజీ, సివిల్ లైసెనింగ్ వంటి రంగాల్లో 12 వేల మందికి శిక్షణ ఇస్తారు. గ్రీన్ స్కిల్లింగ్ అభివృద్ధి కోసం స్వనీతి ఇనిషియేటివ్ సంస్థతో ఎపిఎస్ఎస్‌డిసి మరో ఒప్పందం చేసుకుంది.

కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ..

- విద్యుత్తు బస్సుల పేరుతో ఆర్‌టిసి ప్రైవేటీకరణ
- ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య



రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న ఆర్ లక్ష్మయ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ బస్సుల పేరుతో ఆర్‌టిసి ప్రైవేటీకరణ ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎఐఆర్‌టి డబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య అన్నారు. 'విద్యుత్ బస్సుల నిర్వహణ నేరుగా ఆర్‌టిసికే ఇవ్వాలి' అనే అంశంపై ఎపిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జిలానీ బాషా అధ్యక్షతన మంగళవారం జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే రోడ్డురవాణా సంస్థల్లో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టాలని ఒత్తిడి చేస్తోందన్నారు. ఆ బస్సులను ప్రైవేటు రంగంలో తీసుకువస్తుండటమే ఆర్‌టిసి పట్ల ప్రభుత్వాల చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. ఈ చర్యతో ఉద్యోగులు, కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. విద్యుత్ బస్సుల రాక తర్వాత వాటి నిర్వహణా వ్యయం కూడా ఎక్కువగా ఉంటుందని, ఫలితంగా ప్రజలపై చార్జీల భారం మోపుతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసనగా ఇక సమరం చేయాల్సిందేనని ఆర్ లక్ష్మయ్య అన్నారు. రవాణా రంగంలోని మిగిలిన కార్మిక, ఉద్యోగ సంఘాలతో కలిసి ఐక్యపోరాటాల దిశగా ముందుకు వెళ్లాలని చెప్పారు. వాయుకాలుష్యంలో 50శాతం పరిశ్రమల ద్వారా వస్తోందని, రవాణా రంగం ద్వారా 20నుంచి 30 శాతమే వస్తుందన్నారు. మొత్తం మన వాహనాల్లో 0.69శాతం మాత్రమే ఆర్‌టిసి బస్సులున్నాయని, కాలుష్యానికి ఆర్‌టిసి బస్సులే కారణమన్నట్లు చిత్రీకరిస్తున్నారని ఆయన చెప్పారు. ఢిల్లీలో కాలుష్యం తగ్గించేందుకు డీజిల్ బస్సులను పక్కన పెట్టి సిఎన్‌జి బస్సులను వాడుతున్నారని తెలిపారు. రూ.50, రూ.60లక్షలకు దొరికే సిఎన్‌జి బస్సులను పక్కన పెట్టి రూ.1.80కోట్లకు విద్యుత్ బస్సుల కోసం కేంద్ర ప్రభుత్వం పరుగులు పెడుతోందని ఆయన విమర్శించారు. బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులకు బలవంతంగా విఆర్‌ఎస్ ఇస్తున్నట్లే భవిష్యత్తులో ఆర్‌టిసిలోనూ జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈనెలలో ఫెడరేషన్ జాతీయ సమావేశాలు జరుగుతాయని అనంతరం బడ్జెట్ సమావేశాల్లో ఛలో ఢిల్లీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రం తీసుకొస్తున్న ఇ బస్సుల విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. ఈ పథకాన్ని ఆమోదిస్తే ఆర్‌టిసి పూర్తిగా కనుమరుగవుతుందన్నారు, ఉద్యోగులు ఉపాధి కోల్పోతారని, ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా ఉద్యోగ సంఘాలతో చర్చించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ బస్సులపై ముసాయిదా నివేదికను ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సదస్సు భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించింది. సిఎం, రవాణా శాఖ మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వాలని, జిల్లా స్థాయిలో సదస్సులు, దశల వారీ ఆందోళనలు చేపట్టాలని సదస్సు నిర్ణయించింది. ఈ సదస్సులో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రామయ్య, రాజశేఖర్, శివకుమార్, రాములు, సీతాలక్ష్మి, చిన్న అప్పడు, హరిప్రసాద్, ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ముజిఫర్ అహమ్మద్, శివాజి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్ దొర పాల్గొన్నారు.

మోడీ గోబ్యాక్

- ప్రధాని విశాఖ పర్యటను వ్యతిరేకిస్తూ ఆందోళనలు
- విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్



అనంతపురం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-యంత్రాంగం

విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలిపారు. ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు, కడప స్టీల్ పరిశ్రమలను అటకెక్కించి న మోడీ ఏ మొహం పెట్టుకుని రాష్ట్రానికి వస్తున్నారని నేతలు ప్రశ్నించారు. వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పి ఆ హామీని తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు.

ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటను వ్యతిరేకిస్తూ అనంతపురం కలెక్టరేట్ ఎదుట సిపిఎం నాయకులు, కార్యకర్తలు బైఠాయించి ఆందోళన చేపట్టారు. కేంద్రం పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో నిరసనలు హోరెత్తించారు. విశాఖ పర్యటనలోనే ప్రధాని ఉక్కుపై స్పందించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయడాన్ని ఆపాలంటూ కార్మికులు ఓ పక్క పోరాటాలు చేస్తుంటే పట్టించుకోని మోడీ, మిట్టల్ స్టీల్ పరిశ్రమకు చేయూతనిచ్చేందుకు విశాఖ వస్తుండడం సిగ్గుచేటన్నారు. కర్నూలులో జిల్లా పరిషత్ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. విభజన హామీలు అమలు చేయాలంటూ నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల పాల్గొన్నారు. నంద్యాలలో కలెక్టరేట్ ఎదుట, నందికొట్కూరులో పటేల్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. అభివృద్ధి పట్టని మోడీ రాష్ట్రానికి రావద్దు అంటూ నినాదాలు చేశారు. తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ పాల్గొన్నారు. పుత్తూరు, రేణిగుంట, సత్యవేడు, గూడూరు, శ్రీకాళహస్తిల్లో ఆందోళనలు చేపట్టారు. చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. కడప కలెక్టరేట్ ఎదుట, అన్నమయ్య జిల్లా రాయచోటి బస్టాండ్ సర్కిల్, మదనపల్లెలో మార్కెట్ యార్డ్ వద్ద ఆందోళనలు నిర్వహించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోన్న మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

షెడ్యూల్ కులాల సర్వే వివరాలపై అభ్యంతరాలు స్వీకరించడానికి గడువు ఈ నెల 12వ తేదీ వరకూ పొడిగించిట్లు సాంఘిక సంక్షేమశాఖ ప్రకటించింది. స్వీకరించిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది జాబితాను ఈ నెల 20న ప్రచురించనున్నట్లు ఆ శాఖ అధికారులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తొలుత అభ్యంతరాల స్వీకరణకు గడువును 7వ తేదీ వరకూ మాత్రమే ఆ శాఖ ఇచ్చింది.

అందరికీ ఎంటిఎస్

- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ జెఎసి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, పథకాలు, యూనివర్సిటీలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ మినిమం టైం స్కేల్ (ఎంటిఎస్) విధానం అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, కో-ఛైర్మన్ బి కాంతారావు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన జిఓ 2 వల్ల కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మధ్య వేతనాల విషయంలో తీవ్ర అసమానతలు ఏర్పడతాయని తెలిపారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను అనుసరించి, సమాన పనికి వేతనాన్ని కల్పించాలన్నారు. అనేక పోరాటాలతో ఉమ్మడి రాష్ట్రంలో సాధించుకున్న ఎంటిఎస్‌కు తిలోదకాలు ఇస్తూ గత ప్రభుత్వం జిఓ 7ను విడుదల చేసిందని పేర్కొన్నారు. దీనిని మార్చాలని ఉద్యోగులు కోరుతుంటే గత ప్రభుత్వం చేసిన అన్యాయాన్నే టిడిపి కూటమి ప్రభుత్వం కొనసాగిస్తూ మరలా ఈ జిఓను జారీ చేయడం అన్యాయమన్నారు.

9 నుంచి పిఎసిఎస్ ఉద్యోగుల ఆందోళనలు

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

పిఎసిఎస్ ఉద్యోగులకు 2019, 2024లో చేయాల్సిన వేతన సవరణలు వెంటనే చేయాలని, దీర్ఘకాలంగా ఉన్న పలు పెండింగ్ అంశాలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9 నుంచి పోరుబాట పట్టనున్నట్లు ఎపి స్టేట్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ పేర్కొంది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి అజయ్‌కుమార్, అధ్యక్షులు పివి సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి పి సత్యనారాయణ, కోశాధికారి టి వెంకటరామయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోరుబాటలో భాగంగా ఈ నెల 9న కంప్యూటరైజేషన్ పనులు నిలుపుదల చేయడం, 10న డిసిసిబి ప్రధాన కార్యాలయాల ముందు, 20న జిల్లా కలెక్టరు కార్యాలయాల ముందు, 27న విజయవాడలోని ఆప్కాబ్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే ఫిబ్రవరి 10 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు యూనియన్ నేతలు ప్రకటించారు. తమ ఆందోళన, పోరాటాలకు మద్దతునివ్వాలని రైతు, కార్మిక సంఘాలకు విజ్ఞప్తి చేశారు.

జయమ్మకు రాష్ట్రపతి ఆహ్వానం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు నగరపాలక సంస్థ భూగర్భ డ్రెయినేజీ పారిశుధ్య కార్మికురాలు వనపర్తి జయమ్మకు అరుదైన గౌరవం లభించింది. ఈ నెల 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని రాష్ట్రపతి కార్యాలయంలో జరిగే వేడుకలకు హాజరు కావాలని ఆమెకు ఆహ్వాన పత్రిక అందింది. ఆహ్వాన పత్రాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ మంగళవారం తన ఛాంబర్‌లో జయమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. భూగర్భ డ్రెయినేజీ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి పథకం లబ్ధిదారునిగా, సెప్టిక్ ట్యాంక్ వాహనానికి యజమానిగా ఉంటూ జయమ్మ స్వయం కృషితో విధులు నిర్వహిస్తుండటాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ అరుదైన గౌరవాన్ని కల్పించిందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఇ రామ్‌మోహన్ రావు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- పౌరసరఫరాల సంస్థ కమిషనరుకు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



సివిల్ సప్లై గోడౌన్, డిఎం ఆఫీసులో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ గార్డ్స్, ఆఫీస్ సబార్డినేట్స్‌కు ఉద్యోగ భద్రత, జీతాల పెంపు సమస్యలు పరిష్కరించాలని ఎపి పౌరసరఫరాల సంస్థ కంప్యూటర్ ఆపరేటర్స్, ఎంప్లాయీస్ యూనియన్.. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు యూనియన్ ప్రతినిధులు మంగళవారం సివిల్ సప్లై ప్రధాన కార్యాలయంలో కమిషనరు జి వీరపాండియన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఉమా మహేశ్వరరావు, ఎన్ జగదీష్, బి జాకీర్, వై ఈశ్వరప్రసాద్, వి సంజీవ పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ జల దీక్ష

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే బల్క్‌డ్రగ్ పార్క్‌ను ఏర్పాటు చేయొద్దంటూ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట సముద్ర తీరంలో సిపిఎం నాయకులు, స్థానిక మత్స్యకారులు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని జల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ బల్క్‌డ్రగ్ పార్క్ శంకుస్థాపనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విదేశాల్లోనూ, కాకినాడ సెజ్‌లోనూ వ్యతిరేకించిన ప్రమాదకరమైన బల్క్‌డ్రగ్స్ పార్క్‌ను రాజయ్యపేట ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికే తీర ప్రాంతంలో రసాయన కంపెనీల ఏర్పాటు వల్ల మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోయిందని, బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల ఏర్పాటు కోసం సేకరించిన భూములకు సంబంధించి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించండి : షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.3 వేల కోట్లను ప్రభుత్వం వెంటనే చెల్లించి, వైద్య సేవలను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చిందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. రూ.3 వేలకోట్లు బకాయిలు చెల్లించకుండా నిలిపివేయడమంటే పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రగా పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీకి మంగళం పాడి ప్రజల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. ఈ పథకానికి ఏ లోటూ రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

జగన్‌కు పాస్‌పోర్టు ఇవ్వండి : హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాజా పాస్‌పోర్టు పొందేందుకు అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఒసి) జారీ చేస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. ఐదేళ్ల కాలవ్యవధితో జగన్‌కు పాస్‌పోర్టు ఇవ్వాలని పేర్కొంది. జగన్ కుమార్తె డిగ్రీ ప్రదానోత్సవ కార్యక్రమానికి ఈ నెల 16 నుంచి యుకె వెళ్లేందుకు అనుమతినిచ్చింది. ఎన్‌ఒసి ఇవ్వాలంటే స్వయంగా కోర్టు ముందు హాజరై, రూ.20 వేలతో వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ప్రజా ప్రతినిధుల కేసుల విచారణ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. ఐదేళ్ల కాలవ్యవధితో పాస్‌పోర్టు జారీకి ఎన్‌ఒసి ఇవ్వాలంటే స్వయంగా కోర్టు ముందు హాజరై, రూ.20 వేలతో వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని విజయవాడ ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని జగన్ వేసిన పిటిషన్‌లో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

పలువురు అధికారులకు ముందస్తు బెయిల్

సినీ నటి కాదంబరి జత్వానీ కేసులో సీనియర్ ఐపిఎస్ అధికారులు కాంతిరాణా టాటా, విశాల్ గున్నీ, పోలీసు అధికారులు హనుమంతరావు, ఎం సత్యనారాయణ, న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని, దర్యాప్తునకు అందుబాటులో ఉండాలని, ఎక్కడికైనా ప్రయాణించాలంటే ఆ వివరాలు దర్యాప్తు అధికారికి ఇవ్వాలని జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ షరతులు విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఎంపి అవినాష్ పిఎస్ పిటిషన్ డిస్మిస్

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టకపోయినా, కులం పేరుతో ధూషించకపోయినా తనపై ఎస్‌సి, ఎస్‌టి కేసులో ఇరికించే ప్రయత్నం జరుగుతోందంటూ కడప ఎంపి అవినాష్ రెడ్డి పర్సనల్ సెక్రటరీ బండి రాఘవరెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటీషనన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదైనందున ముందస్తు బెయిల్ కోసం సంబంధిత కోర్టులో పిటిషన్ వేయవచ్చునని చెప్పింది.

పిన్నెల్లిపై కఠిన చర్యలొద్దు

గత స్థానిక సంస్థల ఎన్నికలప్పుడు టిడిపి నేతలతోపాటు మాచర్ల టిడిపి ఆఫీసుపై దాడి చేశారన్న కేసులో వైసిపికి చెందిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై కఠిన చర్యలేవీ తీసుకోవద్దని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని పిన్నెల్లిని ఆదేశించింది. తదుపరి విచారణను సంక్రాంతి సెలవుల తర్వాత చేపడతామని జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సుబ్బారెడ్డికి ముందస్తు బెయిల్

టిడిపి ఆఫీసుపై దాడి ఘటనలో వైసిపి నేత ఉన్నారనే కేసులో ఆ పార్టీ నేత సుబ్బారెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వైసిపి నేత తన మేనల్లుడి పెళ్లిలో ఉంటే, టిడిపి కార్యాలయంపై దాడి ఘటనలో ఉన్నారంటూ తప్పుడు కేసు నమోదు చేశారని పిటిషనర్ వాదన. సిసిటివి ఫుటేజీ ఇచ్చేందుకు పోలీసులు నిరాకరించారు. ఫుటేజీ ఇస్తే దర్యాప్తునకు తీవ్ర విఘాతం ఏర్పడుతుందని పోలీసులు చెప్పారు. దీంతో పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

విడదల రజినికి 41ఎ నోటీసులివ్వండి

విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా జరిపిన ధర్నాలో పాల్గొన్నందుకు చిలకలూరిపేట పట్టణ పోలీసులు పెట్టిన కేసుపై మాజీ మంత్రి విడదల రజిని హైకోర్టులో సవాల్ చేశారు. ఆమెపై నమోదైన సెక్షన్లన్నీ ఏడేళ్ల కంటే తక్కువ శిక్షపడేవే కాబట్టి ఆమెకు సిఆర్‌పిసి సెక్షన్ 41ఎ నోటీసులు ఇవ్వాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 157 | విజయవాడ, బుధవారం 8 జనవరి 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 8 January 2025 | Rs



జిడిపికి ధరల పోటు

- నాలుగేళ్ల కనిష్టానికి పతనం..!
- 2024-25లో 6.4 శాతమే
- ఎన్ఎస్ఒ అంచనాల వెల్లడి

6



మూడోసారి డబ్ల్యుటిసి ఫైనల్‌కు చేరడంలో

టీమిండియా విఫలం

ర్యాంకింగ్స్‌లోనూ పతనమే • ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

8

'ట్రూ అప్' రద్దు చేయండి

ఇఆర్‌సికి వామపక్షాల రాయబారం... బహిరంగ విచారణలో పార్టీలు, నిపుణులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) మంగళవారం నిర్వహించిన బహిరంగ విచారణ సందర్భంగా ప్రజలకు పెనుభారంగా మారుతున్న ట్రూ అప్ ఛార్జీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఇఆర్‌సి వద్దకు రాయబారం నిర్వహించిన వామపక్ష పార్టీలు తక్షణం ట్రూ అప్ ఛార్జీలను రద్దుచేయాలని డిమాండ్ చేశాయి. దీంతో పాటు సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఎపిఇఆర్‌సి ప్రజల తరపున నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరాయి. ఈ మేరకు వామపక్షాల నేతలు ఇఆర్‌సి ఛైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇఆర్‌సి నిర్వహించిన విచారణలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు, విద్యుత్ రంగ నిపుణులు కూడా ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై మోపుతున్న భారాలను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. తొలుత వామపక్ష పార్టీలు విజయవాడలోని ఒక ప్రైవేటు హాలులో బహిరంగ విచారణ జరుపుతున్న ఎపి ఇఆర్‌సి ఛైర్మన్ వద్దక రాయబారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అదాని లాభాలకు గ్యారంటీలు ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వం టిడిపి పేరు చెప్పి ప్రజలపై భారాలు మోపితే, ప్రస్తుత ప్రభుత్వం వైసిపి పేరుచెప్పి అదే పని చేస్తోందన్నారు. ఫలితంగా ప్రజలపై వేల కోట్ల రూపాయల భారం పడుతోందన్నారు. విద్యుత్ ఛార్జీలపై కూటమి ప్రభుత్వం మాటతప్పిందని తెలిపారు. ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచేది లేదని అవసరమైతే తగ్గిస్తామని చెప్పి, ఈ ఆరు నెలల్లోనే ట్రూ అప్, సర్వీసు చార్జీల పేరుతో రూ.16వేల కోట్లు అదనపు భారం వేసిందన్నారు. ఇది చాలదన్నట్లు ఈ ఏడాదికి మరో రూ.5,900 కోట్ల లోటు చూపిస్తుందని చెప్పారు. ఈ లోటును ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా లేదన్నారు. దీంతో ఈ భారం వచ్చే ఏడాది వినియోగదారులపై పడనుందన్నారు. రూ.1,750 కోట్లు లంచాలు తీసుకుని యూనిట్ 2.49 కొనుగోలు చేసేందుకు గత ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే, ఈ ప్రభుత్వం కనీసం విచారణ చేయడం లేదన్నారు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్తు చార్జీలు ఉపసంహరించుకోవడంతో పాటు సెకి ఒప్పందాన్ని రద్దు చేసే వరకూ ఉద్యమం ఆగదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఇఆర్‌సి ఏనాడు ప్రజల ప్రయోజనాలు కాపాడలేదన్నారు. వేల కోట్లు ఖర్చు చేసి స్మార్ట్ మీటర్లు బిగించాలని ఎవరు కోరారని ప్రశ్నించారు. అసెంబ్లీలో అదానీ పేరు ప్రస్తావించేందుకే సిఎం బయపడుతున్నారని చెప్పారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శివర్గ సభ్యులు పి.ప్రసాద్ మాట్లాడుతూ అవినీతి లక్ష్యంగా జరిగిన విద్యుత్ ఒప్పందాలు వల్ల ప్రజలపై పడే భారాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలను మభ్యపెట్టేందుకు ఎపిఇఆర్‌సి ప్రయత్నిస్తోందన్నారు. అనంతరం ప్రజల నుంచి వేలాదిగా సేకరించిన అభ్యంతరాలను ఎపిఇఆర్‌సి ఛైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్‌కు వి శ్రీనివాసరావు, రామకృష్ణ, ఇతర వామపక్ష పార్టీల నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, విజయవాడ తూర్పు, పశ్చిమ కార్యదర్శులు కె. కృష్ణ, బి. రమణరావు, బి.సత్యబాబు, నాయకులు వై.కేశవరావు, ఎం.హరిబాబు, ఆంధ్ర మాల్యాద్రి, సిపిఐ నాయకులు వీరభద్రరావు, పి.దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌ఛార్జి ఛైర్మన్‌కు సంతకాల పత్రాలను సమర్పిస్తున్న వామపక్ష నాయకులు వి శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, తదితరులు

దొడ్డిదారిన భారాలు మోపొద్దు

- స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు
- బహిరంగ విచారణలో బాబూరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులపై దొడ్డిదారిన భారాలు మోపొద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఎపి ఇఆర్‌సి ఛైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ విచారణలో ఆయన మాట్లాడుతూ ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ వంటి పేర్లతో డిస్కమ్‌లు వేలకోట్ల రూపాయలు వసూలు చేస్తున్నాయని, అదే సమయంలో భారాలు మోపడం లేదంటూ పచ్చి అబద్దాలు చెబుతున్నాయని అన్నారు. పాత ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి నెల 40 పైసల విధానాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. విజయవాడ నగరంలో 2 యూనిట్లు వాడిన వినియోగదారులకు రూ.910ల బిల్లు వచ్చిందని బిల్లు ప్రతులను చూపించారు. ఎలక్ట్రిసిటీ డ్యూటీ ధరను 6 పైసలు నుంచి రూ.1కి పెంచారన్నారు. కేంద్రప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఉద్యోగులకు వేతనాలు, బకాయిలు చెల్లించకుండా కార్పొరేట్లకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలో తూర్పు, మధ్య, దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థలు లేవని, కేవలం అదానీ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎపిడిసిఎల్) మాత్రమే ఉందని అన్నారు. ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ విధానాలను రద్దు చేయాలని, సెకి ఒప్పందంపై విచారణ జరిపించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ప్రజలకు విద్యుత్ రాయితీలను కొనసాగించాలని బాబురావు డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ నిపుణులు మిగతా 9లో



భూకంపంతో కుప్పకూలిన టిబెట్ అటానమస్ రీజియన్ షిగాట్సే గ్రామంలోని ఇళ్లు

టిబెట్‌లో భారీ భూకంపం

126 మంది మృతి, 188 మందికి గాయాలు

యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలకు జిన్‌పింగ్ ఆదేశం

నేపాల్, భారత్‌లోనూ ప్రకంపనలు

ఖాట్మండు : నైరుతి చైనా అటానమస్ ప్రాంతమైన టిబెట్ జిజాంగ్‌లోని డింగ్రి కౌంటీలో మంగళవారం ఉదయం భారీ భూకంపంలో 126 మంది మరణించగా, మరో 188 మంది గాయపడ్డారు. భూ కంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.8 పాయింట్లుగా నమోదయింది. భూ కంప నాభి పది కిలోమీటర్ల లోతున భూమిలో ఉన్నట్లు గుర్తించారు. భూ కంపం తరువాత ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి స్థాయిలో సహాయ పునరావాస చర్యలు చేపట్టాలని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ అధికారులను ఆదేశించారు. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా, సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఛైర్మన్‌గా జిన్‌పింగ్ వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.


నేపాల్ సరిహద్దుల్లో కూడా ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. నేపాల్ రాజధాని ఖాట్మండులో భూ కంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదయింది. ఉదయం 9.05గంటల సమయంలో చైనాలోని టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతమైన జిగాజెలోని డింగ్రి కౌంటీ తీవ్రంగా కంపించింది. నేపాల్-టిబెట్ సరిహద్దుకు 93కిలోమీటర్ల దూరంలో లబుచె ప్రాంతంలో భూకంపం సంభవించింది. జిజాంగ్ స్వయంప్రతిపత్తి ప్రాంతంలో లెవెల్ 2 ఎమర్జన్సీ హెచ్చరిక జారీ చేశారు. ఈ భూకంపం తర్వాత టిబెట్ ప్రాంతంలో మరో రెండు ప్రకంపనలు నమోదయ్యాయి. వాటి తీవ్రత 4.7, 4.9గా నమోదైంది. భూకంప కేంద్రం వున్న టిబెట్‌లో పలు భవనాలు నేలమట్టమయ్యాయి. శిధిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు భావిస్తున్నారు.

ఈ ప్రకంపనల ప్రభావం భారత్‌పైనా పడింది. పలు ఉత్తరాది రాష్ట్రాల్లో భూమి కంపించింది. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, బీహార్ సహా పలు చోట్ల భూ ప్రకంపనల వార్తలు వెలువడ్డాయి. భూటాన్; బంగ్లాదేశ్‌ల్లో పలు ప్రాంతాల్లో కూడా ప్రకంపనలు చోటు చేసుకున్నాయి.

అవసరమైన సహాయక చర్యలు చేపట్టాల్సిందిగా చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ ఆదేశాలు జారీ చేశారు. భూకంప బాధితులకు పంపిణీ చేసేందుకు గానూ 22వేల విపత్తు సహాయక వస్తువులను పంపించారు. శిబిరాలు, కోట్లు, దుప్పట్లు, పరుపులు,మిగతా 5లో

ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

- 8న ఓట్ల లెక్కింపు
- ఎన్నికల షెడ్యూల్ విడుదల



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

డెబ్బయి స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి5న ఎన్నికలు జరగనున్నాయి. 8న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్ బీర్ సింగ్ సంధు లతో కలిసి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మంగళవారం నాడిక్కడ విజ్ఞాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ విడుదలజేశారు. దీని ప్రకారం ఈ నెల 10న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. నామినేషన్ వేసేందుకు తుది గడువు జనవరి17, నామినేషన్ల పరిశీలన జనవరి 18. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు జనవరి20.

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మరు క్షణం నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. ఢిల్లీ అసెంబ్లీ పదవీ కాలం వచ్చే నెల 23తో ముగియనుంది. మొత్తం 70 స్థానాల్లో జనరల్ సీట్లు 58 ఉండగా, ఎస్సీ రిజర్వ్‌డ్ 12 సీట్లు ఉన్నాయి. 2015, 2020లో జరిగిన ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ వరుసగా 67, 62 సీట్లతో ఘన విజయం సాధించింది.ఢిల్లీలో మొత్తం ఓటర్లు 1.55 కోట్లు. వీరిలో పురుష ఓటర్లు 83.49 లక్షలు, మహిళా ఓటర్లు 71.74 లక్షలు ఉన్నారు. మహిళా సిబ్బంది నిర్వహించే పోలింగ్ కేంద్రాలు 70, మోడల్ పోలింగ్ కేంద్రాలు 210 ఉన్నాయి.

ఇవిఎంల ట్యాంపరింగ్ ఛాన్సే లేదు

త్వరలో 100 కోట్లకు చేరనున్న ఓటర్లు : సిఇసి

ఈవిఎంల ట్యాంపరింగ్‌కు అవకాశమే లేదని రాజీవ్ కుమార్ తేల్చి చెప్పారు. సాయంత్రం 5 తరువాత పోలింగ్ సరళిలో భారీ పెరుగుదల ఉంటోందని వస్తోన్న ఆరోపణలు సరికాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ శాతాన్ని ఎవరూ మార్చలేరన్నారు. ఇక ఈవిఎంలను హ్యాక్ చేసేందుకు అవకాశమే లేదన్నారు. ఇదే విషయాన్ని న్యాయస్థానాలు 42 సార్లు తమ తీర్పుల్లో చెప్పాయన్నారు. త్వరలోనే దేశంలో ఓటర్ల సంఖ్య 100 కోట్లకు చేరనుందన్నారు.



కోడి పందేలను అడ్డుకోండి

- హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

కోడి పందేలు నిర్వహించకుండా గట్టి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. గతంలో జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలంది. దీనిపై పూర్తి వివరాలను అందజేయాలని పేర్కొంది. విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని పలు గ్రామాల్లో కోడి పందేలను అడ్డుకోవాలని, జూదం, అక్రమ మద్యాన్ని నిరోధించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ చేగొండి శ్రీనివాస్, ఇతరులు వేసిన పిటిషన్లను విచారించిన హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.


ఫిర్యాదుల స్వీకరణకు

'జననాయకుడు' పోర్టల్

- కుప్పంలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఇకపై ఆకస్మిక తనిఖీలు
- జర్నలిస్టులపై కేసులన్నీ ఎత్తేస్తాం

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో, కుప్పం

ఫిర్యాదుల స్వీకరణకు 'జననాయకుడు' పోర్టల్‌ను కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాం. ఈ పోర్టల్ ద్వారా ప్రజలు నేరుగా ఏ సమస్య అయినా చెప్పుకోవచ్చు. ఇక్కడ విజయవంతమైతే ప్రతి నియోజకవర్గంలోనూ ఇలాంటి కార్యక్రమాన్ని చేపడతాం. ప్రతి అర్జీనీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. పరిస్థితిని బట్టి ఆర్థిక సాయం చేస్తాం, టెక్నాలజీ ద్వారా శరవేగంగా సమస్యను పరిష్కరిస్తాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నారు. కుప్పం నియోజకవర్గంలో రెండో రోజూ ఆయన పర్యటన కొనసాగింది మంగళవారం ఆయన టిడిపి కార్యాలయంలో 'జననాయకుడు' పోర్టల్‌ను ప్రారంభించారు. అనంతరం ఈ పోర్టల్ ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో సిఎం మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్)ల్లోనూ, రెవెన్యూ సదస్సుల్లోనూ మిగతా 5లో



ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న సిఎం నారా చంద్రబాబునాయుడు



ఇస్రో నూతన ఛైర్మన్‌గా వి నారాయణన్

బెంగళూరు : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నూతన ఛైర్మన్‌గా వి.నారాయణన్ కేంద్రం నియమించింది. ప్రస్తుత ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ పదవీ కాలం ముగిసిన తరువాత, అంటే ఈ నెల 14న నారాయణన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవీలో ఉంటారు. వి. నారాయణన్ నియామకాన్ని క్యేబినెట్ నియామకాల కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. నారాయణన్ ప్రస్తుతం వల్లమలలోని లిక్విడ్ ప్రోపల్షన్ సిస్టమ్ సెంటర్ (ఎల్‌పిఎస్‌సి) డైరక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే భారత అంతరిక్ష రంగంలో నారాయణన్‌కు దాదాపు 40 ఏళ్ల అనుభవం ఉంది. ఇస్రో నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు.

నేడు విశాఖకు మోడీ

- సిపిఎం నేతల గృహనిర్బంధం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి

భారత ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం విశాఖకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి విశాఖలోని ఐఎన్ఎస్ డేగాకు ప్రధాని చేరుకుంటారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మోడీకి నిరసన తెలపాలని సిపిఎం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావుతోపాటు పలువురి సిపిఎం నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేశారు. దీనిని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి ఎంపి పురందేశ్వరి సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు మోడీ పర్యటనలో భాగస్వాములు కానున్నారు. భద్రత కోసం ఇప్పటికే కేంద్ర రక్షణ దళాలకు చెందిన బలగాలు విశాఖకు చేరుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం ఒంటి గంటకే విశాఖకు విచ్చేసి వైజాగ్ పోర్టు గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, వాల్తేరు డివిజన్‌తో కూడిన విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు వంటి అంశాలపై ప్రధాని ఏ ప్రకటనలు చేస్తారోనన్న చర్చ నడుస్తోంది. ఆంధ్రా యూనివర్సిటీ (ఎయు) గ్రౌండ్స్‌లోని బహిరంగ సభ ప్రాంగణం నుంచే జాతీయ గ్రీన్ హైడ్రోజనర్ మిషన్‌లో భాగంగా పూడిమడకలోని ఎన్‌టిపిసికి చెందిన గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జీ ప్రాజెక్టుకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. విభజన హామీల్లో భాగమైన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేస్తారని తెలుస్తోంది. పారిశ్రామిక, మౌలిక వసతుల రంగాలకు సంబంధించిన కొన్ని ప్రాజెక్టులనూ మోడీ ప్రారంభించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రూ.19,500 కోట్ల విలువైన రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను ప్రధాని ఇక్కడి నుంచే వర్చువల్‌గా మిగతా 9లో



ప్రధాని సభకు ఎయు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సిద్ధమైన వేదిక

సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండన

ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం విశాఖకు వస్తున్న సందర్భంగా పలువురు సిపిఎం నాయకులు, కార్యకర్తలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ చర్యను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఇనుప గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం, రూ.18వేల కోట్ల ప్యాకేజీ సమస్యను పరిష్కారం చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే ఉక్కు ఫ్యాక్టరీ మిగతా 9లో



విశాఖ కూర్మన్నపాలెం కూడలిలో 36 గంటల దీక్ష చేపట్టిన ఉక్కు కార్మికులు

ఉవ్వెత్తున 'ఉక్కు' ఆందోళనలు

- కూర్మన్నపాలెం కూడలిలో 36 గంటల దీక్ష
- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వామపక్షాల ధర్నాలు

ప్రజాశక్తి - ఉక్కునగరం, కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ విశాఖ, అనకాపల్లి జిల్లాలో మంగళవారం నిరసనలు హోరెత్తాయి. ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తూ సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగుల వేతనాలను సకాలంలో చెల్లించాలని, ఈ నెల 8న విశాఖకు వస్తున్న ప్రధాని మోడీ ఉక్కుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో 36 గంటల నిరవధిక దీక్షకు ఉక్కు కార్మికులు, వారి కుటుంబీకులు దిగారు. దీక్షను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరాం, కెఎం.శ్రీనివాసరావు, డి.ఆది నారాయణ, యు.రామస్వామి, వైటి.దాస్ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌ను విస్తరించి నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్లాంట్ పరిరక్షణ విషయమై సిఎం చంద్రబాబు, మిగతా 5లో

సంపాదకీయం

పరిహాసం!

ఒక ప్రాజెక్టు కారణంగా ఎవరు తమ సర్వస్వమూ కోల్పోతున్నారో వారికి తొట్టతొలిగా న్యాయం జరగాలి. పూర్తిస్థాయి పునరావాసం, జీవనోపాధి కల్పించి, ఆ తరువాతనే ప్రాజెక్టు పనిని తలకెత్తుకోవాలి. ఇది అంతర్జాతీయ పునరావాస సూత్రం. చేపడుతున్నది భారీ బహుళార్థక ప్రాజెక్టు అయినప్పుడు, అది పూర్తి కావటానికి ఏళ్లకు ఏళ్లు పడుతున్నప్పుడు, ఆ భారీతనం వల్లనే వందలాది గ్రామాలు ముంపునకు గురై, లక్షలాది మందీ నిర్వాసితులు అవుతున్నప్పుడు- ప్రభుత్వాలు మొట్టమొదటగా దృష్టి పెట్టాల్సింది పునరావాస కల్పన మీదనే! కానీ, మనదేశంలో ఏ ఒక్క ప్రాజెక్టు విషయంలోనూ ఇలాంటి సహజ న్యాయ విధానం అమలు కాలేదు. మన రాష్ట్రంలో వందలాది గిరిజన గ్రామాలను ముంచెత్తే పోలవరం ప్రాజెక్టు లక్షల మంది ఆదివాసీల బతుకులను అస్తవ్యస్తం చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పునరావాసానికి అత్యంత అథమ ప్రాధాన్యం ఇస్తున్నందువల్ల - త్యాగ జనుల ఇక్కట్లూ, ఇబ్బందులూ ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. కాలువల్లో పారాల్సింది నీళ్లు తప్ప నిర్వాసితుల కన్నీళ్లు కాదన్న ఇంగితం పాలకులకు లేకుండా పోయింది!

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తొలి విడత నిర్వాసితులంటూ 20,946 కుటుంబాలకు నష్టపరిహారం విడుదల చేసింది. పదేళ్ల క్రితం ప్రకటించిన ప్యాకేజీ లెక్కల్లోనే పరిహారం చెల్లించటం అన్యాయం. పోస్టాఫీసు పథకాల్లో డిపాజిట్టు చేసుకున్న సొమ్ము సైతం పదేళ్లలో రెట్టింపునకు పైగా పెరుగుతుంది. 2015లో నిర్ణయించిన రూ.5.86 లక్షల పరిహారాన్నే చెల్లించటం నిర్వాసితులను వంచించటమే అవుతుంది. అత్యంత మానవత్వంతో చేపట్టాల్సిన పరిహార చెల్లింపు ప్రక్రియను పాలకులు పరిహాస స్థాయికి దిగజార్చటం దారుణం.

పోలవరం ప్రాజెక్టును ఇప్పటికే 70 శాతానికి పైగా పూర్తి చేశామని, 2027 నాటికి సంపూర్తి చేసి, కాలువల్లో నీళ్లు పారిస్తామని రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఘనంగా చెబుతోంది. తనకు అమరావతి, పోలవరం రెండూ రెండు కళ్ళు వంటివని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రమాణ స్వీకారం చేసిన కొద్దిరోజుల్లోనే ప్రాజెక్టును నేరుగా సందర్శించి, శ్వేతపత్రం విడుదల చేసి, వివిధ పనుల దశాదిశలపై సమీక్షించారు. ప్రాజెక్టు పూర్తిపై ఎంతో శ్రద్ధాసక్తి ప్రదర్శిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం - ప్రాజెక్టు కోసం తమ భూమిని, ఊరిని, ఉనికిని, చరిత్రని, చెట్టుని, సంస్కృతిని ... ఒక్క మాటలో చెప్పాలంటే- తమ సమస్తాన్ని త్యాగం చేస్తున్న నిర్వాసితుల గురించి, వారికి పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించటం గురించీ ఒక్క మాటా చెప్పటం లేదు. పోలవరం నిర్మాణానికి తనదే పూర్తి బాధ్యత అని విభజన చట్టంలో పేర్కొన్న కేంద్ర ప్రభుత్వం కూడా పునరావాసం మీద శ్రద్ధ చూపటం లేదు. ఐదేళ్ల పాటు రాష్ట్ర పాలన సాగించిన వైసిపి ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తానని చెప్పింది తప్ప - దానిని ఆచరణలో పెట్టలేదు. పునరావాస కల్పన, నిర్వాసితుల తరలింపు 13 శాతానికి మించి ముందుకు సాగలేదు. నిర్మించిన పునరావాస కాలనీల్లో కూడా పూర్తిస్థాయి వసతులను ఏర్పాటు చేయలేదు. మనుషులను మనుషులుగా గుర్తించని, గౌరవించని ఘోర నిర్లక్ష్యానికి ఈ ఉదంతం ఒక తార్కాణం. ప్రాజెక్టు నిర్మిస్తే ముంపు ఎంత మేర జరుగుతుందన్న నిర్ధారణ కూడా శాస్త్రీయంగా జరగలేదు. నిర్మాణం ఇంకా పూర్తి కాకుండానే 2022 జులైలో వచ్చిన వరదలకు 41.75 కాంటూరుకు పైన ఉన్న గ్రామాలు సైతం దారుణమైన ముంపునకు గురయ్యాయి. శాస్త్రీయంగా, సవ్యంగా మళ్లీ లెక్కలు తీసి, ముంపు గ్రామాలను, నిర్వాసిత కుటుంబాల సంఖ్యను పునః నిర్ణయించాల్సిన అవసరం ఉంది. ప్రాజెక్టును ప్రకటించి, దాదాపు ఒక తరం కాలం గడిచిపోయింది. పునరావాసం పూర్తిస్థాయిలో సమకూర్చకుండానే ప్రభుత్వాలు నిర్వాసితులను కష్టనష్టాల్లో ముంచెత్తుతున్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరావాసం పట్ల, నిర్వాసితుల పట్ల ప్రదర్శించిన నిర్వాసీతనాన్ని వదులుకోవాలి. కాంటూరు లెక్కలను తాజాపరిచి, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం... పెరిగిన ధరలకు అనుగుణంగా పరిహారం చెల్లించాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలి. పునరావాసం పూర్తిస్థాయిలో చేపట్టి, నిర్వాసితులు తమ బతుకు దారిలో కాళ్లూనుకునేలా చేసిన తరువాతనే ప్రాజెక్టు పనులు చేపట్టాలి. ఈలోగా ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగించాలి.

మహనీయుల మాట




ఒక దేశం అనేకానేక కుటుంబాల సమాహారం. ఇంట్లో న్యాయం, సమానత్వం పాటించకుండా... అవి ప్రజా జీవితంలో మాత్రం ఉండాలని ఆశించలేం. ఇంట్లో అణచివేతకు పాల్పడే పురుషుడు... వీధి లోకి, చట్టసభల లోకి, న్యాయస్థానాల లోకి వచ్చే సరికి హఠాత్తుగా మారిపోయి సాధువు కాలేడు.


- సుబ్రమణ్య భారతి,
సంఘ సంస్కర్త.

అభిప్రాయం

ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడుకోవాలి!



కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఆనందాన్ని, అలాగే దేశ విభజన వల్ల ఎదురైన బాధాకరమైన విషాదాలను రెండింటినీ పద్నాలుగేళ్ళ బాలుడిగా నేను అనుభవించాను. ఇలాంటి అసమ్మతి, విద్వేషం మరోసారి అనుభవంలోకి రాకుండా ఒక దేశంగా భారత్ బలంగా ఎదగాలని నేను ఆశించాను. ఈనాడు, భారత్ ఏదైతే సాధించిందో అందుకు గర్వంగా వుంది. ఈ మహత్తర దేశ భవితవ్యం గురించి కూడా చాలా ఆశాభావంతో వున్నాను. అయితే, సామాజిక సామరస్యతను కలుషితం చేసేలా, ప్రజలను విభజించేలా వేర్పాటువాద నినాదాలు, మతోన్మాద స్పర్ధలు తలెత్తడం గురించి కూడా నేను ఆందోళన చెందుతున్నాను.



డా॥ మన్మోహన్ సింగ్

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం త్వరలోనే ఈ భూగోళంపై అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారనుంది. అందువల్ల వ్యక్తిగత, సమిష్టి స్వేచ్ఛల పరిరక్షణకు, పెంపునకు సంబంధించి అంతర్జాతీయ ప్రమాణాలను నిర్దేశించాల్సిన ప్రత్యేక బాధ్యతను ఈ 75 ఏళ్ళ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు తీసుకు వచ్చాయి. భారత త్రివర్ణ పతాకం సమున్నతంగా రెపరెపలాడుతుండగా ప్రతి ఒక్క భారతీయుడు గర్వంగా అభివాదం చేస్తుంటే, ఆ పతాకంలోని మువ్వన్నెలు సమ్మిళితమైన సంస్కృతిని మనకు గుర్తు చేయాలి. ఈ సంస్కృతే ప్రపంచంలోని విశిష్టమైన, అతి గొప్ప ప్రజాస్వామ్యాన్ని మనకు అందించింది. ఈ చారిత్రక సందర్భంగా, నిరంకుశపూరితమైన అహంకారం మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించేందుకు అనుమతించబోమని లేదా విద్వేషాలను రెచ్చగొట్టి భారతీయుల సమైక్యతను దెబ్బ తీసేందుకు అనుమతించ బోమని మనం తీర్మానించుకోవాలి. జాతీయ పతాకానికి మనం ఘనంగా సమర్పించగలిగిన వందనం ఇదే.

అమూల్యమైన ఐక్యత

ఉక్కిరిబిక్కిరి చేసిన వలస పాలన నుండి బయటపడి విస్తృతమైన బ్రిటీష్ పాలిత భూభాగాలు, సంస్థానాల నుండి ఒక దేశంగా భారత్ ఆవిర్భవించింది. ఈ ఐక్యత ఏదో రాత్రికి రాత్రే హఠాత్తుగా సాకారమై పోలేదు. మహాత్మా గాంధీ రగిల్చిన స్ఫూర్తితో, విదేశీ పాలనను అంతమొందించాలని భావించే భారతీయులందరినీ సమైక్య పరిచిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నేతృత్వంలో ఇది సాకారమైంది. బహుళ భాషలు, మతాలు, కులాలు, సామాజిక హోదాలతో నిమిత్తం లేకుండా, స్త్రీ పురుష భేదం లేకుండా భారతీయులందరినీ ఈ ఉద్యమం ఏకం చేసింది. ఆ సమైక్యత భారత దేశానికి చాలా అమూల్యమైనది. భారతీయ గుర్తింపును చిన్నాభిన్నం చేసే మతోన్మాద విచ్ఛిన్నకర, భాషాపరమైన దురభిమానంతో కూడిన, నిర్లక్ష్య పూరితమైన కులతత్వ, లింగ వివక్షతతో కూడిన ప్రచారాల ద్వారా ఈ సమైక్యతను చెదిరిపోనివ్వరాదు. భారతీయులపైకి భారతీయులనే పురిగొల్పడం ద్వారా అటువంటి ఎత్తుగడలు తాత్కాలికమైన రాజకీయ ప్రయోజనాలను కలిగించవచ్చు. కానీ, మహత్తర దేశంగా ప్రగతి వైపు సాగే భారతదేశపు పంథాను బీటలు వారుస్తాయి. లేదా అడ్డంకులను సృష్టిస్తాయి.

75 ఏళ్ళ భారత్-గతం-భవిష్యత్

వలస పాలన మన సంపదలను దోచేసింది. స్వాతంత్ర్యం లభించిన తర్వాత పేద వర్ధమాన దేశంగా మనం జీవితాన్ని ఆరంభించాం. ఆ స్థాయి నుండి నేడు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు కీలకమైన, ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఆవిర్భవించే స్థాయికి ఎదిగాం. 1991లో ప్రారంభించిన ఆర్థిక ఉదారవాద విధానాలు మన ఆర్థికాభివృద్ధిపై నిర్ణయాత్మకమైన ప్రభావాన్ని చూపాయి. అదే సమయంలో, దారిద్ర్య నిర్మూలన, ఆర్థిక అసమాతల అంతరాన్ని తగ్గించడమనేది ప్రభుత్వ విధాన ప్రధాన సూత్రంగా మారింది. అందరినీ కలుపుకుని పోయేలా సమ్మిళిత ఆర్థిక వృద్ధి పంథాను మనం కొనసాగిస్తున్నందున, ఆదాయ అంతరాలను మరింత విస్తరిస్తూ, సంక్షేమ ప్రయోజనాలను కేవలం ఎంపిక చేసిన కొద్దిమంది వ్యాపారవేత్తలు మాత్రమే అనుభవించడానికి మనం అనుమతించరాదు.

విభజన రాజకీయాలపై ధ్వజం

ఉపాధి కల్పించలేని అభివృద్ధి ఏ ఆర్థిక వ్యవస్థకూ సురక్షితమైనది కాదు. నిరుద్యోగం మన మానవ వనరులను గరిష్టంగా ఉపయోగించడానికి అనుమతించకపోవడమే కాకుండా సామాజిక అసమ్మతి, విభజన రాజకీయాలు పాదుకొనడానికి కూడా వెసులుబాటు కల్పిస్తుంది. రాబోయే పాతికేళ్ళ స్వతంత్ర భారతం వైపుగా మనం పయనిస్తున్నందున, విద్య, నైపుణ్యాలు, అనువైన ఉపాధి, యువ పారిశ్రామికవేత్తలకు, ఆవిష్కర్తలకు తోడ్పాటునందించడం ద్వారా యువతరాన్ని గరిష్టంగా ఉపయోగించుకోవడం మన లక్ష్యంగా వుండాలి. ఇందుకు విద్య, ఉపాధి కోసం దేశవ్యాప్తంగా సులభంగా రాకపోకలు అవసరం. మతోన్మాద, భాషాపరమైన అడ్డంకులు అటువంటి రాకపోకలను ఆటంకంగా తయారవుతాయి. అభివృద్ధిపై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తాయి. ఈ ప్రమాదాన్ని భారతీయ పారిశ్రామికవేత్తలు కచ్చితంగా గుర్తించాలి. జాతీయ ఐక్యత కోసం తమ గళమెత్తాలి. విచ్ఛిన్నకర, విభజన రాజకీయాలు ఆర్థిక వ్యవస్థకు ముప్పు కలిగిస్తున్నపుడు మౌన ప్రేక్షకుల్లా చూస్తూ ఊరుకోరాదు.

శాస్త్రీయ సంప్రదాయ పరిరక్షణ

స్వాతంత్ర్యం తొలినాళ్ళ నుండి సైన్స్‌లో నైపుణ్యాలను పురోగతికి బాటగా భారత్ అనుసరించింది. జాతీయ శాస్త్రీయ విధానం ముందుచూపుతో సాగుతోంది. శాస్త్రీయ విజ్ఞాన నైపుణ్యాల అభ్యాసానికి, పరిశోధనకు గొప్ప సంస్థలు ఏర్పాటు చేయబడ్డాయి. భారతదేశంలోని వివిధ సాంకేతిక సంస్థలు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అవార్డులు గెలుచుకున్నాయి. ఈ సంస్థల్లో చదివిన అనేకమంది విద్యార్థులు అంతర్జాతీయ పేరు ప్రతిష్టలు సాధించారు. మన రోదసి, సముద్రాల అధ్యయన శాస్త్రం, అణు కార్యక్రమాలు ఇవన్నీ కూడా మనల్ని ఎంపిక చేసిన దేశాల జాబితాలో నిలిపాయి. ఈ దేశాల శాస్త్రీయ పరాక్రమాలు, సాంకేతిక నైపుణ్యాలను యావత్ ప్రపంచం గుర్తించి, గౌరవించింది. విద్యాపరమైన సమగ్రతను పణంగా పెట్టి సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసే నాయకత్వం వల్ల మన శాస్త్రీయ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు అణగదొక్కబడితే అది చాలా దురదృష్టకరం. ప్రాచీన కాలం నుండి భారత్ గర్వించదగిన శాస్త్రీయ విజ్ఞానాన్ని, సాంప్రదాయాలను కలిగి వుంది. కానీ, మన శాస్త్రీయ సమాజానికి అప్రతిష్టను తీసుకువచ్చే కుహనా సైన్స్‌కు ఒక ముసుగుగా లేదా సాకుగా మారరాదు.

ప్రపంచ దేశాల సమూహంలో, సూత్రబద్ధమైన వైఖరులు అనుసరించినందుకు, వలస పాలనను వ్యతిరేకించినందుకు, రెండు అధికార గ్రూపులు ప్రపంచ ఆధిపత్యాన్ని కోరుకుంటున్న వేళ మానవ హక్కులను సమర్థిస్తూ, శాంతి ప్రయోజనాలను పెంపొందిస్తూ అలీనోద్యమానికి నాయకత్వం వహించినందుకు భారతదేశం అపరిమితమైన గౌరవాన్ని పొందింది. మన పొరుగు దేశాలతో మన సంబంధాలు చాలా వరకు సామరస్యంగా వుంటాయి. కొన్ని దేశాలతో ఘర్షణలు వున్నప్పటికీ, శాంతియుత సహజీవనానికి వెసులుబాటు కల్పించేలా అవగాహనా వారధులను నిర్మించడానికి మనం ప్రయత్నించాం. ప్రపంచ దేశాల్లో సరికొత్తగా తలెత్తే ఘర్షణలు, కొత్తగా రూపొందే పొత్తులు వున్నప్పటికీ ఈ వైఖరులనే మనం కొనసాగించాల్సిన అవసరం వుంది. ప్రపంచంలోని అనేక దేశాల్లో మరీ ముఖ్యంగా దక్షిణాసియా దేశాల్లో విశ్వసనీయ, గౌరవనీయ, మిత్ర దేశంగా మనం పరిగణించడం చాలా కీలకం. వ్యక్తిగత వైఖరులపై ఆధారపడి మన విదేశాంగ విధానం నడవడానికి మనం అవకాశమివ్వరాదు. సమర్థులైన దౌత్యవేత్తల మద్దతుతో, తెలివైన నాయకత్వం ద్వారా స్పష్టమైన చొరవలను అనుసరించాల్సి వుంది.

యువత సంక్షేమం

యువత ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలను పెంపొందించడంపై భారత్ తప్పనిసరిగా దృష్టి కేంద్రీకరించాలి. పోషకాహార లోపంతో సరైన ఎదుగుదల లేకపోవడం, రక్తహీనత వంటి సమస్యలు పునరుత్పాదక వయస్సులో వున్న మన పిల్లలు, మహిళల్లో ఎక్కువ శాతాన్ని ప్రభావితం చేస్తున్నాయని ఇటీవల చేపట్టిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5) మనకు గుర్తుచేస్తోంది. ఇతర రంగాల్లో ముఖ్యంగా నీరు, పారిశుధ్య రంగాల్లో పోషకాహారానికి ప్రాధాన్యమిచ్చే విధానాలను మనం ముందుకు తీసుకెళ్ళినప్పటికీ నిర్దిష్టంగా పోషకాహార కార్యక్రమాలు చేపట్టేందుకు మనం హామీ కల్పించాల్సిన అవసరం వుంది.

మన ఆరోగ్య వ్యవస్థలో వున్న అనేక రకాల బలహీనతలను కోవిడ్ వెల్లడించింది. వ్యాధి పట్ల అప్రమత్తత, నిఘా దగ్గర నుండి ఆరోగ్య సంరక్షణ నిబంధనల వరకు ఆరోగ్య సేవల సామర్థ్యాలను మనం బలోపేతం చేసుకోవాల్సిన అవసరం వుంది. వివిధ రాష్ట్రాల ఆరోగ్య వ్యవస్థల పని తీరు, సామర్థ్యాల్లో అనేక తేడాలు వున్నాయి. ఆరోగ్య రంగంలో రాష్ట్రాలు మరింతగా పెట్టుబడులు పెట్టడం తప్పనిసరి. ఆరోగ్య ప్రామాణికాల్లో వెనుకబడిన రాష్ట్రాలకు మరింత తోడ్పాటు అందించేందుకు ఉద్దేశించిన కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కూడా పెట్టుబడులు పెట్టడం ముఖ్యం. అందరికీ అవసరమైన ఆరోగ్య సేవలను అందిస్తూ, తగిన ఆర్థిక రక్షణ కల్పించడం సార్వజనీన ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా వుండాలి. దేశవ్యాప్తంగా దీన్ని ఏకరీతిన మనం సాధించాల్సి వుంది.

పౌరుడు ఆలోచించేందుకై...

కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఆనందాన్ని, అలాగే దేశ విభజన వల్ల ఎదురైన బాధాకరమైన విషాదాలను రెండింటినీ పద్నాలుగేళ్ళ బాలుడిగా నేను అనుభవించాను. ఇలాంటి అసమ్మతి, విద్వేషం మరోసారి అనుభవంలోకి రాకుండా ఒక దేశంగా భారత్ బలంగా ఎదగాలని నేను ఆశించాను. ఈనాడు, భారత్ ఏదైతే సాధించిందో అందుకు గర్వంగా వుంది. ఈ మహత్తర దేశ భవితవ్యం గురించి కూడా చాలా ఆశాభావంతో వున్నాను. అయితే, సామాజిక సామరస్యతను కలుషితం చేసేలా, ప్రజలను విభజించేలా వేర్పాటువాద నినాదాలు, మతోన్మాద స్పర్ధలు తలెత్తడం గురించి కూడా నేను ఆందోళన చెందుతున్నాను. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛలను పరిరక్షించాల్సిన సంస్థలను బలహీనపరచడం, సుపరిపాలన నిబంధనలను బలపరిచే సంస్థలను తుంగలో తొక్కడం, ధనబలం, కో ఆప్టెడ్ ప్రభుత్వ సంస్థల దాడి నుండి ఎన్నికల రాజకీయాలను సంరక్షించాల్సిన సంస్థలనూ బలహీనపరుస్తున్నారు. ఎంతగానో కష్టపడి సాధించుకున్న మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించుకోవడం, భారత పౌరుల కర్తవ్యం. మనం తలెత్తి మన పతాకానికి అభివాదం చేస్తున్న వేళ మనందరిలో ఈ కర్తవ్య సంరక్షణ ప్రతిబింబించాలి.

(డా॥ మన్మోహన్ సింగ్ 2004 నుండి 2014 వరకు భారత ప్రధానిగా వున్నారు. 2022 ఆగస్టు 15 'హిందూ' సౌజన్యంతో /

అంతర్జాతీయం

విఫల నాయకుడి నిష్క్రమణ

పార్టీలో తలెత్తిన కుమ్ములాటల కారణంగా పలుకుబడి పాతాళానికి పడిపోవటం, ఆర్థిక మంత్రి రాజీనామా, ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య యుద్ధానికి డోనాల్డ్ ట్రంప్ ప్రకటన తదితర అనేక కారణాలతో ట్రూడో రాజీనామా ప్రకటన చేశాడు. పార్టీలో అంతర్గత పోరు కారణంగా వచ్చే ఎన్నికల్లో పార్టీని విజయ పథాన నడిపించటానికి తాను తగిన వాడిని కాదని, ఈ అంశంతో పాటు ప్రభుత్వంలో సంక్షోభం రాజీనామాకు కారణాలని ఆ సందర్భంగా చెప్పుకున్నాడు. రాజీనామా చేయటానికి ముందు అనేక మంది స్వంత పార్టీ ఎంపీలు గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ట్రూడో ఏ మాత్రం కొనసాగినా వచ్చే ఎన్నికల్లో ఓడిపోవటం ఖాయమన్నాయి అనేక సర్వేలు.





ఎం. కోటేశ్వరరావు

అతడు పది సంవత్సరాల క్రితం లిబరల్ పార్టీకి అనూహ్య విజయం చేపట్టిన నేతగా నీరాజనాలు అందుకున్నాడు. ఇప్పుడు అతని ఉనికి పార్టీని పాతాళానికి దించుతుందంటూ అదే పార్టీ నేతలు తూర్పారపడుతున్నారు. అతడే కెనడా ప్రధాని, 53 సంవత్సరాల జస్టిన్ ట్రూడో. ఇంటా బయటా తలెత్తిన పరిస్థితి కారణంగా ఉక్కిరి బిక్కిరితో పార్టీ, ప్రభుత్వ పదవి నుంచి తప్పుకొంటూ సోమవారం నాడు ఆకస్మికంగా రాజీనామా ప్రకటన చేశాడు. ఈ నెల 27న ప్రారంభం కావాల్సిన పార్లమెంటు సమావేశాలను మార్చి 24 వరకు సస్పెండ్ చేశారు. వెంటనే పార్లమెంటును రద్దు చేసి ఎన్నికలు జరపాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. పార్లమెంట్ ప్రారంభం కాగానే ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం పెడతామని మూడు ప్రధాన పార్టీలు ప్రకటించాయి. అదే జరిగితే ప్రభుత్వ పతనం ఖాయం. ట్రూడో ప్రకటన వెలువడిన వెంటనే డోనాల్డ్ ట్రంప్ స్పందించాడు. అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా విలీనం కావటం మంచిదని గతంలో చేసిన ప్రకటనను పునరుద్ఘాటించాడు. అది అందరికీ మంచిదన్నాడు. రష్యా, చైనాల నుంచి పోటీని ఎదుర్కోవాల్సిన అవసరం ఉండదన్నాడు. ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని ఎన్నుకొనేంత వరకు ట్రూడో పదవుల్లో కొనసాగుతాడు. వారం రోజుల్లో కొత్త నేతను ఎంపిక చేస్తామని లిబరల్ పార్టీ ప్రకటించింది. పార్టీలో తలెత్తిన కుమ్ములాటల కారణంగా పలుకుబడి పాతాళానికి పడిపోవటం, ఆర్థిక మంత్రి రాజీనామా, ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య యుద్ధానికి డోనాల్డ్ ట్రంప్ ప్రకటన తదితర అనేక కారణాలతో ట్రూడో రాజీనామా ప్రకటన చేశాడు. పార్టీలో అంతర్గత పోరు కారణంగా వచ్చే ఎన్నికల్లో పార్టీని విజయ పథాన నడిపించటానికి తాను తగిన వాడిని కాదని, ఈ అంశంతో పాటు ప్రభుత్వంలో సంక్షోభం రాజీనామాకు కారణాలని ఆ సందర్భంగా చెప్పుకున్నాడు. రాజీనామా చేయటానికి ముందు అనేక మంది స్వంత పార్టీ ఎంపీలు గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ట్రూడో ఏ మాత్రం కొనసాగినా వచ్చే ఎన్నికల్లో ఓడిపోవటం ఖాయమని అనేక సర్వేలు వెల్లడించాయి. గడచిన రెండు ఎన్నికల్లోనూ లిబరల్ పార్టీ తక్కువ శాతం ఓట్లతో ఎక్కువ సీట్లు తెచ్చుకొని మైనారిటీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. న్యూ డెమోక్రటిక్ పార్టీ (ఎన్‌డిపి)కి 17.82 శాతం ఓట్లు 25 సీట్లు వచ్చాయి. ఈ పార్టీ మద్దతుతో ట్రూడో నెట్టుకొచ్చాడు.

గతేడాది సెప్టెంబరులో న్యూ డెమోక్రటిక్ పార్టీ మద్దతు ఉపసంహరించుకోవటంతో అస్థిర పరిస్థితి ఏర్పడింది. 2025 అక్టోబరు వరకు పార్లమెంటు వ్యవధి ఉన్నప్పటికీ ఏ క్షణంలోనైనా పార్లమెంటు రద్దు, మధ్యంతర ఎన్నికలు రావచ్చని భావించారు. అయితే సమస్యను బట్టి తాము మద్దతు లేదా వ్యతిరేకించటం చేస్తామని ఎన్‌డిపి ప్రకటించటంతో ప్రభుత్వం ఊపిరి పీల్చుకుంది. అయితే డిసెంబరు 16న ఉప ప్రధాని, ఆర్థిక మంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్ రాజీనామాతో పాలక పార్టీలో లుకలుకలు తీవ్రమయ్యాయని చెప్పవచ్చు.

పెరుగుతున్న ధరలు రోజువారీ జీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయని రెండు సంవత్సరాల క్రితం 33 శాతం మంది కెనడా పౌరులు చెబితే 2024లో 45 శాతానికి పెరిగినట్లు సామాజిక సర్వే వెల్లడించింది. ఇళ్ల అద్దెలు భరించలేకుండా ఉన్నామని 38 శాతం చెప్పారు. 2021 నుంచి ధరల ద్రవ్యోల్బణం పెరుగుదల వలన ప్రతి ఐదుగురిలో ఒకరు సామాజిక సంస్థల నుంచి తక్కువగానో ఎక్కువగానో ఆహారాన్ని పొందినట్లు చెప్పారు. ఆర్థిక సమస్యలతో స్వల్పంగా లేదా తీవ్రంగా మానసిక ఒత్తిడికి గురైనట్లు 35 శాతం చెప్పారు. తక్కువ ఆదాయం వచ్చే వారిలో ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. అద్దె ఇళ్లలో ఉండే వారిలో జీవన సంతృప్తి చాలా తక్కువగా ఉంది. వయసు మీరిన వారి కంటే యువత ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తేలింది. 25-44 సంవత్సరాల వయస్సులో ఉన్నవారిలో 55 శాతం మంది ధరల పెరుగుదల గురించి ఆందోళన వెల్లడించారు. వృద్ధులలో 28 శాతం ఉన్నారు. ఫుడ్ బ్యాంకులు, సామాజిక సంస్థల నుంచి ఆహారాన్ని పొందుతున్నవారు యువకులలో 46-47 శాతం ఉండగా వృద్ధులలో 27-28 శాతం ఉన్నారు. పిల్లలపై ధరల పెరుగుదల ప్రతికూల ప్రభావం గురించి చెప్పనవసరం లేదు. ఆర్థికంగా కెనడా తీవ్రమైన అనిశ్చితిని ఎదుర్కొంటోంది.

ధనిక దేశాల్లో తలెత్తిన సంక్షోభం 2008 నుంచి నేటి వరకు కెనడాలో అనిశ్చితి సూచిక తీవ్ర వడిదుడులకు లోనవుతున్నది. రెండు వేల సంవత్సరం నుంచి 2008 వరకు 50 నుంచి 200 మధ్య కదలాడగా తరువాత అది వంద నుంచి 400 మధ్య ఊగిసలాడింది. 2020 కరోనా సమయంలో గరిష్టంగా 690, గతేడాది 650గా ఉంది. ట్రూడో ప్రకటనతో ఈ ఏడాది అది మరింతగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటికీ అక్టోబరులోగా ఎన్నికలు జరగాల్సి ఉండగా పెట్టుబడిదారులు ఎలాంటి నిర్ణయాలు తీసుకొనే అవకాశం లేదు. తమ ప్రాజెక్టులను తాత్కాలింగా నిలిపివేయటం లేదా వాయిదా వేసుకొనే అవకాశాలు ఉన్నాయి. ఇది ఉపాధి మీద కూడా తీవ్ర ప్రభావం చూపటం అనివార్యం. నూతన నియామకాలు పరిమితం అవుతాయి. కరెన్సీ కెనడా డాలరు విలువ కూడా గత వారంలో పతనమై కొత్త రికార్డు నెలకొల్పింది. ప్రధాని రాజీనామా ప్రకటన తరువాత స్వల్పంగా పెరిగినప్పటికీ అనిశ్చితిలో కొనసాగవచ్చు. కెనడా అతి పెద్ద వాణిజ్య భాగస్వామి అమెరికా. దిగుమతి చేసుకొనే వస్తువులపై 25 శాతం పన్ను విధిస్తానని డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన గురించి తెలిసిందే. ఆర్థిక రంగంలో అనిశ్చిత పరిస్థితి ఉన్న కారణంగా దీని గురించి బేరమాడే శక్తి కెనడాకు తగ్గుతుంది. ట్రంప్ చర్య అమెరికా వినియోగదారుల మీద భారాలు మోపినప్పటికీ కెనడా ఎగుమతుల మీద కూడా ప్రతికూల ప్రభావం చూపనుంది. 1985 నుంచి రెండు దేశాల మధ్య వాణిజ్య లావాదేవీలలో కెనడా మిగులులో ఉంది. తమ వస్తువులను మరింతగా దిగుమతి చేసుకోవాలని అమెరికా ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది.

గత కొద్ది నెలలుగా పార్టీ ఎంపీలు అనేక మంది డిమాండ్ చేసినప్పటికీ రాజీనామాకు ససేమిరా అన్న ట్రూడో డిసెంబరులో జరిగిన పరిణామంతో దిగిరాక తప్పలేదు. ప్రధానితో తన విబేధాల గురించి ఫ్రీలాండ్ రాజీనామా లేఖలో వెల్లడించారు. రాజకీయ జిమ్మిక్కులు భారీ మూల్యం చెల్లిస్తున్నాయంటూ పరోక్షంగా చేసిన విమర్శల లేఖను బహిర్గతం చేయటంతో వత్తిడి మరింత పెరిగింది. ఈ ఏడాది బడ్జెట్ లోటు 20 బిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా వేయగా అది 60 బిలియన్ డాలర్లకు పెరిగింది. బడ్జెట్ లోటు, ఆర్థిక అసమానతలను తగ్గిస్తానంటూ యువకుడిగా రంగంలోకి దిగిన ట్రూడోకు యువతరం బ్రహ్మరథం పట్టటంతో 2015లో ఘన విజయం లభించింది, ఆచరణలో దానికి భిన్నంగా వ్యవహరించాడు. తీవ్రమైన అవినీతి ఆరోపణలను కూడా ఎదుర్కొన్నాడు. ట్రూడో రాజీనామాతో పాలక లిబరల్ పార్టీ, ప్రతిపక్ష కన్సర్వేటివ్ పార్టీ నుంచి ప్రధాని పదవికి పోటీ పెరిగింది. మంత్రి పదవికి రాజీనామా చేసిన క్రిస్టియా ఫ్రీలాండ్, ప్రస్తుతం రవాణా శాఖ మంత్రిగా ఉన్న భారతీయ సంతతికి చెందిన అనిత ఇందిరా ఆనంద్, విదేశాంగ మంత్రి మెలీనా జోలీ కూడా ప్రధాన పోటీదారుగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఆఫ్ కెనడా గవర్నర్‌గా పని చేసి ట్రూడోకు సలహాదారుగా ఉన్న మార్క్ కార్నే కూడా రేసులో ఉన్నాడు. ప్రభుత్వానికి అపకీర్తి తెచ్చిన కార్బన్ పన్ను విధింపు ఇతగాడి సలహా మేరకే జరిగింది. మూడు సార్లు ఓట్లు అధికంగా తెచ్చుకున్నప్పటికీ అవసరమైన సీట్లు తెచ్చుకోవటంలో విఫలమైన ప్రతిపక్ష నేత పిరే పోయిలివరే ఎన్నికల్లో మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకొనేందుకు సిద్ధం అవుతున్నాడు. ఒక టీవీ జరిపిన సర్వేలో పిరేకు 44.2 శాతం మంది మద్దతు ప్రకటించగా ట్రూడోకు 24 శాతం ఉన్నారు. కరోనా తరువాత వివిధ దేశాలలో జరిగిన ఎన్నికల తీరుతెన్నులను చూస్తే అధికారంలో ఉన్నవారందరూ దాదాపు ఓడిపోయారు. కెనడాలో కూడా లిబరల్ పార్టీ పరిస్థితి అలాగే ఉంది. రకరకాల ఆకర్షక వాగ్దానాలతో మద్దతు పొందిన వారిని హృదయ సామ్రాట్టులుగా జేజేలు కొట్టిన జనమే...తీరు మారితే ఏ విధంగా తరిమి కొట్టారో బంగ్లాదేశ్, శ్రీలంక పరిణామాలు స్పష్టం చేశాయి. మన దేశంలో పాలక పార్టీలు వీటి నుంచి గుణపాఠాలు తీసుకుంటాయా? ★

జనవాక్యం

కొంచెం జాగ్రత్త

చైనాలో తాజాగా వైరస్ వ్యాప్తితో ఊపిరి తిత్తుల సంబంధిత వ్యాధి రోగులు తామరతంపగా పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. హ్యూమన్ మెటా న్యూమో(హెచ్.ఎమ్.పి) వైరస్ కారకంగా తెలియ వస్తోంది. అదే వైరస్ కేసులు ఇతర ప్రపంచ దేశాల్లో కూడా రిపోర్ట్ అవుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియజేసింది. భారత్‌లో బెంగుళూర్‌లో రెండు కేసులు బయటపడ్డాయి. అయితే వాటికీ, చైనాలో కేసులకు సంబంధం లేదని ఐసీఎమ్మార్ ప్రకటించింది. అది ఊరట. ఈ నేపథ్యంలో భారత్ అప్రమత్తంగా ఉండడం అవసరం. కోవిడ్ వ్యాప్తిలో జరిగిన అనుభవాల ఆధారంగా కొంత జాగ్రత్త పాటించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వైరస్ వ్యాప్తి పట్ల సమాచారం వెంటవెంటనే అందజేసేటట్లు చూడాలి. చైనా, ఇతర దేశాల్లో పరిస్థితుల్ని దగ్గరగా గమనించాలి. ప్రజారోగ్య విభాగాల్ని, సంబంధిత యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలి. ఆక్సిజన్ నిల్వలు, సిబ్బంది, సపోర్ట్ సిస్టమ్‌లను సిద్ధం చెయ్యాలి. వీటన్నింటి కన్నా ముఖ్యంగా వ్యాప్తి నివారణ అంశాలపై దృష్టి పెట్టాలి. మాస్కుల వినియోగం, చేతుల శుభ్రత, గుంపుల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కలిగించాలి. కరోనా సమయంలో పాటించిన జాగ్రత్తలను ప్రజా సమూహాలు మళ్లీ అలవర్చుకోవాలి. ముఖ్యమైన విషయమేమిటంటే ఈ హెచ్.ఎమ్.పి వైరస్ కొత్తది కాదు. ప్రమాదకరమైనదీ కాదు. 2001 నుండి తెలిసిందే. పిల్లల్లో శ్వాస సంబంధిత వ్యాధుల్లో 12 శాతం దీని వల్లే వస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్ళలో ప్రమాదకరంగా మారవచ్చు అన్న ఉద్దేశ్యంతో జాగ్రత్త పడాలి. శీతాకాలంలో సహజంగానే వైరస్ వ్యాప్తి ఎక్కువ. కాబట్టి కేసులు ఎక్కువ కనబడతాయి. నివారణ జాగ్రత్తలతో వ్యాప్తిని వీలైనంత తగ్గిస్తే వ్యాధి భారం సమాజంలో తగ్గుతుంది. ఆ కోణం లోనే ఆలోచించి, తదనుగుణంగా ఆచరిస్తే సరిపోతుంది.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రణబ్ ముఖర్జీ స్మారక చిహ్నానికి స్థలం కేటాయింపు

న్యూఢిల్లీ : మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్మారక చిహ్నం నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఈ విషయాన్ని ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ట ముఖర్జీ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. రాజ్‌ఘాట్ ఆవరణలో భాగమైన 'రాష్ట్రీయ స్మృతి' కాంప్లెక్స్‌లో ప్రణబ్ ముఖర్జీ స్మారక చిహ్నం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించినట్లు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ మంత్రిత్వ శాఖ తనకు లేఖ ద్వారా తెలిపినట్లు శర్మిష్ట తెలిపారు. ఈ విషయంపై మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి శర్మిష్ట కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఇటీవల మరణించిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు ఢిల్లీలో స్మారక చిహ్నం నిర్మించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న సందర్భంలో కేంద్రం నుంచి ప్రణబ్ స్మారక చిహ్నం కోసం ప్రకటన రావడం గమనార్హం.

నేడు 'జమిలి' ప్యానెల్ తొలి భేటీ

న్యూఢిల్లీ : జమిలి ఎన్నికలపై ఏర్పాటైన పార్లమెంటరీ ప్యానెల్ తొలి సమావేశం బుధవారం జరగనుంది. జమిలి ఎన్నికల కోసం ప్రతిపాదించిన రెండు బిల్లులను పరిశీలించనుంది. ఈ బిల్లులపై న్యాయ మంత్రిత్వ శాఖకు చెందిన అధికారులు ప్యానెల్ సభ్యులకు వివరించనున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా రాజ్యాంగం (129వ సవరణ)బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ) బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వీటిని పరిశీలన కోసం ఈ ప్యానెల్‌కు పంపిన సంగతి తెలిసిందే. బిజెపి ఎంపి, కేంద్ర న్యాయ శాఖ మాజీ సహాయ మంత్రి పి.పి. చౌదరి నేతృత్వంలో 39 మంది సభ్యులతో పార్లమెంట్ జాయింట్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ ప్యానెల్‌లో కాంగ్రెస్ నుంచి ప్రియాంక గాంధీ వాద్రా, జెడి(యు) నుంచి సంజయ్ ఝా, శివసేన నుంచి శ్రీకాంత్ షిండే, ఆప్ నుంచి సంజయ్ సింగ్, టిఎంసి నుంచి కళ్యాణ్ బెనర్జీతో సహా ప్రధాన పార్టీల సభ్యులు ఉన్నారు. ముందుగా 31 మందితో ఈ ప్యానెల్‌ను ఏర్పాటు చేసినా, తరువాత పలు రాజకీయ పార్టీల విజ్ఞప్తితో ఈ సంఖ్యను 39కు పెంచారు. ఇందులో లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది ఉన్నారు.

'భారత్ పోల్' పోర్టల్ ప్రారంభం

న్యూఢిల్లీ : అంతర్జాతీయ పోలీసు సహాయం కోసం కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) అభివృద్ధి చేసిన 'భారత్ పోల్' పోర్టల్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'ఇంటర్ పోల్‌'లోని 195 సభ్య దేశాల నుంచి కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు తమ కేసులకు సంబంధించిన సమాచారాన్ని పంచుకోవడానికి, పొందడానికి 'భారత్ పోల్' ఉపయోగపడుతుందని చెప్పారు. దేశం నుంచి పరారైన నేరస్తులను పట్టుకోవడానికి, వారిని కోర్టుల్లో హాజరుపర్చడానికి సహకరిస్తుందని తెలిపారు.

ఆశారామ్‌కు మధ్యంతర బెయిల్

న్యూఢిల్లీ : బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో శిక్ష అనుభవిస్తున్న వివాదస్పద ఆధ్యాత్మిక గురువు ఆశారామ్‌కు మధ్యంతర బెయిల్ లభించింది. 86 ఏళ్ల ఆశారామ్‌కు వైద్య చికిత్స నిమిత్తం మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఆయన న్యాయవాది కోరగా.. విచారణ జరిపిన సుప్రీంకోర్టు మంగళవారం మార్చి 31 వరకూ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే ఆయన ఎవ్వరినీ కలవరాదని, అనుచరులతో సమావేశం కారాదని షరతులు విధించింది. కాగా శిక్షను రద్దు చేయాలని కోరుతూ ఆశారామ్ దాఖలు చేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుంద్రేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఆశారాం ప్రస్తుతం జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. 2013లో ఆశ్రమంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో పోక్సో కోర్టు ఆశారాంకు జీవితఖైదు విధించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటి వరకూ 11 ఏళ్ల జైలు శిక్షను ఆశారాం అనుభవించారు. కాగా, మరో అత్యాచారం కేసులోనూ గుజరాత్‌లోని గాంధీనగర్ సెషన్స్ కోర్టు గతేడాది జనవరిలో ఆశారాంకు జీవిత ఖైదు విధించింది.

టిబెట్‌లో భారీ భూకంపం

(మూడవ పేజీ తరువాయి)

ఇంకా ఇతరత్రా అవసరాలకు సంబంధించిన వస్తువులు అందులో వున్నాయి. జిగాజె ప్రాంతం భారత్ సరిహద్దుకు సమీపంలో వుంది. ఇది టిబెట్‌లోని పవిత్రమైన నగరాల్లో ఒకటిగా భావిస్తారు. దలైలామా తర్వాత స్థానంలోని పంచలామా సాంప్రదాయ స్థానం ఈ ప్రాంతం. డింగ్రి కౌంటీలోని ట్సోగో టౌన్‌షిప్‌లో భూకంప కేంద్రం వుంది. 20కిలోమీటర్ల పరిధిలో 6900మంది ప్రజలు ఇక్కడ వున్నారు. ఈ ప్రాంతంలో 27 గ్రామాలు వున్నాయి.

టంగ్‌స్టన్ మైనింగ్‌పై తమిళనాడు కన్నెర్ర

- మదురైలో వేలాది మంది అన్నదాతల ఆందోళన
- అసెంబ్లీ తీర్మానానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కేంద్రం



టంగ్‌స్టన్ మైనింగ్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ మదురైలో ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గమైన, అప్రజాస్వామిక విధానాలపై తమిళనాడు ప్రజానీకం కన్నెర్ర చేశారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై మోడీ సర్కార్ కక్షపూరిత ధోరణిని ఎండగట్టారు. తమిళనాడులో ఆ రాష్ట్ర ప్రజాభిమతానికి వ్యతిరేకంగా ఒక మైనింగ్ ప్రాజెక్టును కేంద్రం బలవంతంగా చేపట్టాడాన్ని నిరసిస్తూ మంగళవారం వేలాది మంది అన్నదాతలు ఆందోళన చేపట్టారు. మరోవైపు తమిళనాడు గవర్నరు రవి తీరుపైనా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిజెపి చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తూ రాజ్యాంగ పదవిని ఆయన కలంకితం చేస్తున్నారని తప్పుబట్టారు.

మదురై జిల్లాలోని మేలూర్ తాలూకా వద్ద టంగ్‌స్టన్ మైనింగ్ ప్రాజెక్టును కేంద్రం చేపడుతోంది. ఈ ప్రాజెక్టు చేపట్టవద్దని రాష్ట్ర శాసనసభ తీర్మానం చేసినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల లాభాలే పరమావధిగా ఈ ప్రాజెక్టును బలవంతంగా చేపడుతోంది. దీనిని నిరసిస్తూ మదురైలో 25 కిలోమీటర్ల మేర రైతులు మంగళవారం భారీ ప్రదర్శన చేపట్టారు. మేలూర్, సమీప ప్రాంతాల నుండి దాదాపు 10,000 మందికి పైగా రైతులు, గ్రామస్తులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మదురై నగరంలోని నరసింగంపట్టి నుండి తాళ్లకుళం వరకు చేపట్టిన మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తిరుచ్చి-మధురై జాతీయ రహదారి మీదుగా తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చేరుకున్న ఆందోళనకారులు ఒతకడై మీదుగా ఎంజిఆర్ బస్టాండ్ దాటి జిల్లా కోర్టు దగ్గర మలుపు తీసుకున్నారు. అక్కడి నుంచి తాళ్లకుళం చేరుకున్నారు. టిఎన్ఎయు, ఒతకడై, మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ వంటి కొన్ని ముఖ్యమైన జంక్షన్ల వద్ద పోలీసులు బారికేడ్లు వేసినప్పటికీ, రైతులు వాటిని ఛేదించి ముందుకు సాగారు. అయితే, భారీ జనసమూహాన్ని నిరోధించేందుకు అనేక మంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల అడ్డంకులను ఛేధించుకొని వేలాది మంది రైతులు నిరసన ప్రదేశానికి చేరుకొన్నారు. కేంద్రం తీరును నిరసిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ బైఠాయించారు. ప్రాజెక్టు కోసం కేటాయించిన 5 వేల ఎకరాల్లో కేవలం 500 ఎకరాలు వదిలేయడం వల్ల ప్రజలకు, పర్యావరణానికి ఎలాంటి మేలు జరగదన్నారు. మైనింగ్ ప్రాజెక్టులతో పర్యావరణానికి నష్టం వాటిల్లడాన్ని ఇప్పటికే అనేక ఘటనలు స్పష్టం చేశాయని, ఇకపై మా భూమి విధ్వంసాన్ని తట్టుకోలేమని స్పష్టం చేశారు.

జీవనోపాధులపై దాడి : సిపిఎం నేత నాగరాజన్

రాష్ట్ర ప్రభుత్వం వద్దేవద్దు అని చెబుతున్నా కేంద్రంలోని మోడీ సర్కార్ బలవంతంగా చేపడతున్న టంగ్‌స్టన్ మైనింగ్ ప్రాజెక్టు వల్ల స్థానిక ప్రజలు జీవనోపాధులను కోల్పోతారని సిపిఎం నాయకులు, మదురై డిప్యూటీ మేయర్ టి నాగరాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పాటు ఈ ప్రాంతంలో అనేక చారిత్రక చిహ్నాలు కూడా ధ్వంసం కానున్నాయని తెలిపారు. సిపిఎం సీనియర్ నేత ఎకె పద్మనాభన్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రెండు నెలలుగా సిపిఎం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిల్లో ఉద్యమిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీర్మానాన్ని, ప్రజలు డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ నిరసనకు మద్దతుగా ఆగ్రో ఫుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ ఎస్ రత్నవేలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రజల ఏకైక జీవనోపాధి వ్యవసాయమని, ఇప్పుడు ఈ ప్రాజెక్టుతో సాగు విస్తీర్ణం తగ్గిపోయి ఆహార ఉత్పత్తిపైనే తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఉపాధి పైనా, వ్యవసాయోత్పత్తులపైనా వినాశకర ప్రభావం చూపనున్న ఈ ప్రాజెక్టును తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

గవర్నర్ రవి తీరుపై డిఎంకె నిరసన

తిరునల్వేలి : తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి వ్యవహార శైలిని విమర్శిస్తూ పాలక డిఎంకె కార్యకర్తలు తిరునల్వేలి సహా పలు నగరాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని స్తంభింపచేయాలనే, అధికార యంత్రాంగాన్ని నిర్వీర్యం చేయాలనే బిజెపి రహస్య ఎజెండాను అమలు చేసేందుకు రవి పదే పదే ప్రయత్నిస్తున్నారని ఆందోళనకారులు విమర్శించారు. ప్రభుత్వాన్ని కూలదోయాలనే ఆయన కల తమిళనాడులో ఎన్నటికీ నెరవేరదని స్పష్టం చేశారు. రాజ్యాంగం ద్వారా ప్రభుత్వానికి కల్పించిన హక్కులపై గవర్నర్ రవి దాడి చేస్తున్నారని ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ప్రసంగాలతో తమిళనాడు చరిత్రను వక్రీకరిస్తున్నారని, తమిళులను, ఈ రాష్ట్రం నుండి తయారైన దిగ్గజాలను అవమానపరుస్తున్నారని వారు విమర్శించారు. ఇదే రీతిలో ఆయన వ్యవహరిస్తే రాష్ట్రం నుండి వెళ్లిపోక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వానికి సమస్యలు సృష్టించేందుకు గవర్నర్‌తో కలిసి అన్నా డిఎంకె కుమ్మక్కయిందని వారు ఆరోపించారు. తిరునల్వేలిలో జరిగిన ఆందోళనా కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. టెంకాశి, నాగర్‌కోయిల్, కోయంబత్తూరు నగరాల్లోనూ నిరసన ప్రదర్శనలు జరిగాయి. తమిళ వ్యతిరేక వైఖరి అనుసరిస్తున్న గవర్నర్ రవిని వెనక్కి పిలిపించాలని వారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కోరారు.

అన్నదాతలకు నో అపాయింట్‌మెంట్

- రాష్ట్రపతిభవన్ నిర్ణయంపై ఎస్‌కెఎం తీవ్ర విచారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోరాడుతున్న రైతులకు తీవ్ర నిరాశ ఎదురైంది. తమ గోడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎలాగూ పట్టించుకోవడం లేదు కనీసం రాష్ట్రపతి అయినా పట్టించుకుంటారన్న ఆశతో అపాయింట్‌మెంట్ కోసం వేచిచూసిన రైతన్నలకు ఆశాభంగమే ఫలించింది. అన్నదాతల సమస్యలను విన్నవించేందుకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నాయకులు అపాయింట్‌మెంట్ కోసం విన్నవించగా రాష్ట్రపతి కార్యాలయం నిరాకరించింది.

దీనిపై రైతు ఉద్యమ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతు సంఘాల నాయకులను సమయాభావం కారణంగా కలిసేందుకు అంగీకరించలేకపోతున్నామని తెలిపారు. అయితే, రాష్ట్రపతి భవన్ ఈ నిర్ణయాన్ని సమీక్షించి అపాయింట్‌మెంట్ ఇస్తుందని సంయుక్త కిసాన్ మోర్చా ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మంత్రులు ఇప్పటివరకు ఈ ప్రతిష్టంభనను పరిష్కరించలేకపోయాయని, రైతు ఉద్యమ నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను రక్షించడానికి నిర్మాణాత్మక చర్యలు తీసుకోవడం లేదని విమర్శించింది. దేశాధినేతగా రాష్ట్రపతి అయినా ఈ సమస్యను పట్టించుకోవాలని కోరింది. దల్లేవాల్ గత 42 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే.

చీకటి చట్టాలకంటే ప్రమాదకరం

రద్దు అయిన మూడు చీకటి వ్యవసాయ చట్టాల కంటే కేంద్రం తాజాగా తీసుకొచ్చిన వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధాన ముసాయిదా (ఫ్రేమ్‌వర్క్) ప్రమాదకరమని ఎస్‌కెఎం పేర్కొంది. రైతులు, వ్యవసాయ కార్మికులు, చిన్న వ్యాపారుల జీవనోపాధిపై దాడిగా అభివర్ణించింది.

అంధకారంలో అమెరికా ప్రజానీకం

- మంచు తుపాను కమ్మేయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పలు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ



కార్లపై పేరుకుపోయిన మంచు

వాషింగ్టన్ : అమెరికాలో లక్షలాది మంది ప్రజానీకం అంధకారంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అతిపెద్ద మంచు తుపాను సెంట్రల్, తూర్పు అమెరికాను కమ్మేయడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అత్యంత శీతల గాలులు, భారీగా కురుస్తున్న హిమపాతంతో ప్రజలు వణికిపోతున్నారు. మంచు తుపాను సంబంధిత కారణాలతో ఇప్పటివరకు ఐదుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. సోమవారం నాడు 2300కి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. వేలాది విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. మిస్సోరి నుండి వర్జీనియా వరకు దాదాపు రెండు లక్షలమంది ప్రజలు విద్యుత్ లేకుండా చీకట్లో మగ్గుతున్నారు.

ఈ సంవత్సరంలో మొట్టమొదటిదైన ఈ మంచు తుపాను మంగళవారం రాత్రికి తూర్పు దిశగా పశ్చిమ అట్లాంటిక్ ప్రాంతంలోకి పయనించనుంది. ఈ తుపాను ఉధృతి తగ్గినా మరికొన్ని రోజుల పాటు గడ్డ కట్టించే ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని భావిస్తున్నారు. కన్సాస్ సిటీ వంటి కొన్ని నగరాల్లో మైనస్‌ల్లోకి ఉష్ణోగ్రతలు వెళ్లిపోయాయి. అమెరికా గల్ఫ్ తీర ప్రాంతంలో ఈ సీజనులోనే అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. కాగా బాధిత ప్రాంతాలకు తక్షణమే సాయం అందించేందుకు వీలుగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితులను నిశితంగా పర్యవేక్షిస్తోందని వైట్‌హౌస్ ప్రతినిధి చెప్పారు. మంచు తుపాను కారణంగా వాషింగ్టన్‌లో కార్యాలయాలు, స్కూళ్ళు మూతపడ్డాయి. కెంటకీ ప్రాంతంలో ప్రమాదకర స్థాయిలో మంచు కురుస్తుండడంతో హైవేలన్నీ మంచు దిబ్బలుగా మారిపోయాయి. సరస్సులన్నీ గడ్డ కట్టేసి మంచు మైదానాలుగా మారిపోయాయి. కెంటకీ, మిస్సోరి, వర్జీనియా, మేరీల్యాండ్, టెక్సాస్ సహా పలు రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితులను ప్రకటించారు. అత్యవసరమైతే తప్ప రోడ్లపైకి వెళ్ళవద్దని ప్రజలను కోరారు. వాతావరణ మార్పుల వల్ల ఇటువంటి విపరీతమైన వాతావరణ పరిస్థితులు రాన్రాను సర్వసాధారణమై పోతాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

యూన్ అరెస్టుకు మరో వారెంట్ జారీ

సియోల్ : దేశంలో సైనిక పాలన విధించిన కేసులో అభిశంసించబడిన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను అరెస్టు చేసేందుకు మరోసారి వారెంటు జారీ అయింది. ఈ మేరకు దక్షిణ కొరియా అవినీతి నిరోధక సంస్థకు ఆదేశాలు అందాయి. సస్పెండయిన అధ్యక్షుడి అరెస్టుకు గత శుక్రవారం దర్యాప్తు అధికారులు తీవ్రంగా యత్నించి విఫలమయ్యారు. యూన్‌ను అరెస్టు చేయాల్సిందేనని దక్షిణ కొరియన్లు అధ్యక్ష భవనం ఎదుట శిబిరాలు ఏర్పాటు చేసి డిమాండ్ చేస్తున్నారు. వీరికి పోటీగా యూన్ తన అనుయాయులను ఆందోళనకు దింపారు. దీంతో అక్కడ ఆరు గంటలపాటు ఉద్రిక్తత నెలకొంది. ఈ సారి యూన్‌ను అరెస్టు చేసే బాధ్యత పోలీసులే తీసుకోవాలని దర్యాప్తు అధికారులు కోరారు. మొదట జారీ చేసిన ఆరెస్టు వారెంట్ అమలుకు వారం రోజులు మాత్రమే గడువు ఇచ్చారు. తాజాగా జారీ చేసిన వారెంటు ఎన్ని రోజులు అమల్లో వుంటుందో నిర్దిష్టంగా వెల్లడించలేదు. యూన్‌ను నిర్బంధంలోకి తీసుకోవడానికి



సియోల్ పశ్చిమ జిల్లా కోర్టు గత వారం మొదటి వారెంట్ జారీ చేసింది. ఆయన నివాసాన్ని సోదాచేయడానికి విడిగా మరో వారెంట్ ఇచ్చింది.. డిసెంబరు 3న విధించిన మార్షల్ లా డిక్రీపై ప్రశ్నించేందుకు హాజరు కావాల్సిందిగా అధికారులు పంపిన సమన్లను ఆయన ధిక్కరిస్తూ వచ్చారు. ఆ తర్వాత అధికారులు మరో ప్రయత్నం చేయలేదు. సోమవారంతో ఆ కోర్టు వారంట్ల గడువు ముగిసిపోయింది.

జాహ్నవి మృతి కేసులో పోలీసు అధికారికి ఉద్వాసన

సియాటిల్, న్యూయార్క్ : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు విద్యార్థిని జాహ్నవి కందుల మరణించిన కేసులో ఆ ప్రమాదానికి బాధ్యుడైన సియాటిల్ పోలీసు అధికారి కెవిన్ డేవ్‌ను పోలీసు విభాగం నుండి తొలగించినట్లు అధికారులు ప్రకటించారు. ఎవరినీ గాయపరచాలన్నది ఆ అధికారి ఉద్దేశం కానప్పటికీ ఆయన ప్రమాదకర డ్రైవింగ్ వల్ల జరిగిన విషాద పర్యవసానాలను తాము ఆమోదించలేకపోయామని సియాటిల్ తాత్కాలిక పోలీసు చీఫ్ సూ రాహెర్ చెప్పారు. సియాటిల్ పోలీసు డిపార్ట్‌మెంట్ నుండి కెవిన్ డేవ్‌కు ఉద్వాసన చెప్పినట్లు తెలిపారు. 2023 జనవరి 23న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జాహ్నవి సియాటిల్‌లో రోడ్డు దాటుతుండగా పోలీసు ఆఫీసర్ కెవిన్ డ్రైవ్ చేస్తున్న వాహనం దూసుకొచ్చి ఆమెను ఢీ కొంది. డ్రగ్ ఓవర్‌డోస్ బాధితుడి నుండి కాల్ రావడంతో ఆ వ్యక్తిని తీసుకువచ్చేందుకు మితిమీరిన వేగంతో కెవిన్ కారు నడుపుతున్నాడు. కారు ఢీ కొన్న వేగానికి జాహ్నవి వంద అడుగుల దూరంలో పడిపోయారు. బాధితుడిని త్వరగా చేరాలన్న ఆయనఉద్దేశం ఒక మనిషి ప్రాణాన్ని తీసిందని, సియాటిల్ పోలీసు విభాగానికి అపఖ్యాతి తెచ్చిపెట్టిందని, అందువల్ల ఆ వ్యక్తి చర్యను సమర్థించలేమని పోలీసు చీఫ్ వ్యాఖ్యానించారు. అందుకే కెవిన్‌ను పోలీసు శాఖ నుండి తొలగించినట్లు చెప్పారు. ఈ మేరకు ఆమె ఒక ఇ మెయిల్ పంపారు. సియాటిల్ టైమ్స్ ఈ వార్తా కథనాన్ని ప్రచురించింది. పైగా గస్తీ వాహనం తిరిగేటపుడు ఎమర్జెన్సీ లైట్లు ఉపయోగించడం వంటి ముందు జాగ్రత్తలు తీసుకోలేదని ఆమె పేర్కొన్నారు. జాహ్నవి మృతిపై అనుచితమైన వ్యాఖ్యలు చేస్తూ, నవ్విన ఓ పోలీసు అధికారి డేనియల్ ఆడెరర్‌కు ఉద్వాసన చెప్పిన కొన్ని నెలలకే కెవిన్ ఉద్వాసన చోటు చేసుకుంది. డేనియల్, కెవిన్ డేవ్‌లపై చర్య తీసుకోవడంతో కందుల కుటుంబానికి న్యాయం జరిగినట్లైందని భావిస్తున్నారు.

బొగ్గు గనిలో ప్రమాదం

- అస్సాంలో ముగ్గురు మృతి

డిస్పూర్ : అస్సాంలోని దిమా హసౌ జిల్లాలో అనుమతులు లేని ఒక బొగ్గు గనిలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు మరణించారు. మరో 10 మంది కార్మికులు గనిలో చిక్కుకున్నారు. గనిలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు ఆర్మీ, నేవీకి చెందిన బృందాలు పెద్ద ఎత్తున రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ కోసం విశాఖపట్నం నుంచి నిష్ణాతులైన నేవీ డైవర్లును కూడా రప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్రాంగ్సోకు సమీపంలోని ఈ బొగ్గు గనిలోకి సోమవారం ఉదయం వరద నీరు చేరడంతో ప్రమాదం సంభవించిందన్నారు. మంగళవారానికి మూడు మృతదేహాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. 300 అడుగుల లోతు ఉన్న ఈ గనిలో దాదాపు 100 అడుగుల వరకూ నీరు చేరుకుందన్నారు. గని నుంచి నీటిని పంపింగ్ చేసేందుకు యంత్రాలను కూడా వినియోగిస్తున్నారు. కాగా, ఈ గనికి ఎలాంటి అనుమతులు లేవని, కేసు నమోదు చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.



గనిలో చిక్కుకున్నవారిని బయటకు తీసుకొస్తున్న సహాయక సిబ్బంది

విసిల నియామక నిబంధనల్లో మార్పులు

- పరిశ్రమ నిపుణులు, పిఎస్‌యుల సీనియర్లకూ అవకాశం
- ముసాయిదా మార్గదర్శకాలు విడుదల చేసిన యుజిసి

న్యూఢిల్లీ : దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్ల నియామకాలకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ముసాయిదా మార్గదర్శకాలు విడుదల చేసింది. వీటి ప్రకారం పరిశ్రమకు చెందిన నిపుణులను, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెషనల్స్‌ను నేరుగా విసిలుగా నియమించుకునే అవకాశం లభిస్తుంది. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమితులు కావాలంటే ప్రొఫెసర్‌గా లేదా ప్రముఖ పరిశోధనలో లేదా అకడమిక్ అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో కనీసం పది సంవత్సరాల పాటు పని చేసి ఉండాలి. అయితే ఇప్పుడు తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం పరిశ్రమలో, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో, ప్రభుత్వ విధానాలలో లేదా కనీసం ప్రభుత్వ రంగ సంస్థలో కనీసం పది సంవత్సరాల సీనియర్ స్థాయి అనుభవం గడించి ఉంటే సరిపోతుంది. ముసాయిదా మార్గదర్శకాలను కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విడుదల చేశారు. యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకానికి సంబంధించిన నిబంధనలకు కూడా ఆయన అందులో సవరణలు ప్రతిపాదించారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు ఏ సబ్జెక్టులో పొందినప్పటికీ యుజిసి-నెట్‌లో మంచి పనితీరు కనబరచిన సబ్జెక్టులో అధ్యాపకులుగా నియమితులు కావడానికి అర్హత పొందుతారు. దీనిపై యుజిసి ఛైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్ మాట్లాడుతూ ఇది చాలా ముఖ్యమైన వెసులుబాటు అని చెప్పారు. సూచనల కోసం నూతన మార్గదర్శకాలను యుజిసి వెబ్‌సైటులో ఉంచారు. కనీసం 55 శాతం మార్కులతో ఎంఇ లేదా ఎంటెక్ ఉత్తీర్ణులైన వారిని యుజిసి-నెట్‌లో అర్హత సాధించకపోయినా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నేరుగా నియమించుకోవచ్చు. ఏ సబ్జెక్టులో అయితే అధిక విద్యార్హత కలిగి ఉంటారో ఆ సబ్జెక్టునే బోధించే వెసులుబాటు కూడా ఉంటుంది. అంటే మాథమెటిక్స్‌లో బ్యాచిలర్, ఫిజిక్స్‌లో మాస్టర్ డిగ్రీలు ఉండి కెమిస్ట్రీలో పిహెచ్‌డి చేసి ఉంటే కెమిస్ట్రీలోనే బోధించవచ్చు. దీనివల్ల వివిధ నేపథ్యాల నుండి వచ్చిన వారిని ఎంపిక చేసుకునే అవకాశం లభిస్తుందని జగదీష్ కుమార్ తెలిపారు. కాగా నూతన మార్గదర్శకాలు కేంద్ర, రాష్ట్ర, ప్రయివేటు, డీమ్డ్ యూనివర్సిటీలకు వర్తిస్తాయి.

ప్రయివేటీకరణ కోసమే ఈ ముసాయిదా : ఎస్ఎఫ్ఐ

యుజిసి ముసాయిదాను ఎస్ఎఫ్ఐ తిరస్కరించింది. యూనివర్శిటీలను కేంద్రీకరించడానికి, ప్రయివేటీకరణకు మరో ప్రయత్నంగా ఈ ముసాయిదాను విమర్శించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉన్నత విద్యను రక్షించడానికి ముందుకు రావాలని విద్యావేత్తలను కోరింది. అలాగే ముసాయిదా నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలపాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చింది. ఇప్పటికే తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్ల నియామకాల విషయంలో గవర్నర్ల జోక్యం పెరుగుతోందని, కేంద్రం కనుసన్నల్లో బిజెపి ఏజెంట్‌లా వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురి చేస్తోందని పేర్కొంది. తాజా ముసాయిదాలో వైస్ ఛాన్సలర్ల నియామకంలో గవర్నర్లకు ఎక్కువ అధికారాలను కట్టబెట్టారని, రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకు ఇలాంటి ప్రతిపాదనలు చేశారని ఎస్ఎఫ్ఐ విమర్శించింది. అలాగే ముసాయిదా నిబంధనలను పరిశీలించడానికి మొదటిసారిగా పారిశ్రామిక వేత్తలను అనుమతించడం విద్యా రంగంలో కార్పొరేట్ సంస్కృతిని చొప్పించే ప్రయత్నంగా పేర్కొంది. అలాగే ఉపాధ్యాయులకు నిర్దిష్ట బోధన సమయం ప్రస్తావించలేదని, ఇది ఉపాధ్యాయులపై పనిభారం పెంచడానికి, ఉద్యోగాలను తగ్గించడానికి ఒక ప్రమాదకరమైన వ్యూహంగా ఎస్ఎఫ్ఐ విమర్శించింది.

కార్మిక కోడ్స్‌ను నోటిపై చేస్తే సార్వత్రిక సమ్మె

- కేంద్రానికి 10 ట్రేడ్ యూనియన్ల హెచ్చరిక

న్యూఢిల్లీ : నాలుగు నూతన కార్మిక కోడ్స్‌ను నోటిఫై చేస్తే సార్వత్రిక సమ్మెకు దిగుతామని కేంద్ర ప్రభుత్వాన్ని 10 ట్రేడ్ యూనియన్లు హెచ్చరించాయి. ట్రేడ్ యూనియన్లతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సోమవారం నిర్వహించిన ప్రీ బడ్జెట్ సమావేశంలో లేబర్ కోడ్ అమలు గురించి ప్రస్తావన వచ్చింది. లేబర్ కోడ్లను అమలు చేయవద్దని 10 ట్రేడ్ యూనియన్లు కేంద్ర మంత్రిని కోరాయి. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశాయి. ప్రజా, కార్మిక వ్యతిరేకమైన ఈ కార్మిక కోడ్లను 'అహంకార పూరితమైన, దారుణమైనవి'గా విమర్శించాయి. ఈ విధానాలు ఒకవైపు ప్రజలపై మోయలేని భారాలు, నిరుద్యోగం వంటి సమస్యలను మోపుతున్నాయని, మరొకవైపు నిరసనలు, అసమ్మతిని తెలిపే ప్రజాస్వామిక హక్కులు అరికట్టబడుతన్నాయని విమర్శించింది. అలాగే పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్)ను పునరుద్ధరించడానికి, 8వ పే కమిషన్ ఏర్పాటుకు కేంద్రం నిరాకరిస్తుందని, దీనికి వ్యతిరేకంగా ప్రజా-కార్మిక ఐక్య పోరాటాన్ని మరింత ముందుకు తీసుకుని వెళతామని ట్రేడ్ యూనియన్లు ప్రకటించాయి. అలాగే రైతులు, వ్యవసాయ కార్మికులు చేస్తున్న ఉద్యమానికి ట్రేడ్ యూనియన్లు మద్దతు ప్రకటించాయి.

ఉవ్వెత్తున 'ఉక్కు' ఆందోళనలు

(మూడవ పేజీ తరువాయి)

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌లు మోడీపై ఒత్తిడి తేవాలన్నారు. దీక్షలో పోరాట కమిటీ నాయకులు ఎం రాజశేఖర్, కెఎస్ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, ఎన్.రామారావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేయాలి : వామపక్షాలు

స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని రద్దు చేయాలని విశాఖలో వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. 'ఉక్కు' రక్షణ కోసం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వామపక్షాలు ధర్నా నిర్వహించాయి. విశాఖ పర్యటనలోనే ప్రధాని ఉక్కుపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాను ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ప్రారంభించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షత వహించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ళ పైడిరాజు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు జిల్లా నాయకులు సిహెచ్.దేవా, ఎంసిపిఐ జిల్లా నాయకులు శంకరరావు, ఎస్‌యుసిఐసి రాష్ట్ర నాయకులు ఎస్.గోవిందరాజులు మాట్లాడారు. నాలుగేళ్లుగా ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం సాగుతుంటే ప్రధానికి పట్టకపోవడం దారుణమన్నారు.

ఫిర్యాదుల స్వీకరణకు 'జననాయకుడు' పోర్టల్

(మూడవ పేజీ తరువాయి)

అందిన ఫిర్యాదులు అపరిష్కృతంగా ఉంటున్నాయని, దీంతో, ఈ పోర్టల్‌ను ప్రవేశపెట్టామని తెలిపారు. ఈ ఫిర్యాదులు ఆన్‌లైన్లో నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి వస్తాయన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు నేరుగా సంబంధిత జిల్లా, రెవెన్యూ డివిజన్ అధికారులతో మాట్లాడుతారని తెలిపారు. అప్పటికీ సమస్య కాకపోతే తానే నేరుగా జోక్యం చేసుకుంటానని ముఖ్యమంత్రి వివరించారు. కుప్పంలో ఈ ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా దీనిని అమలు చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు కూడా ఈ పోర్టల్‌లో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్రంలో ఇకపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై ఉన్న కేసులన్నీ ప్రత్యేక జిఒ ద్వారా ఎత్తేస్తామని ప్రకటించారు కుప్పంలో జరిగిన గ్రానైట్ అక్రమాలపై దర్యాప్తు చేస్తామన్నారు. పార్టీకి కోటి సభ్యత్వ నమోదు జరగడం ఒక చరిత్ర అని పేర్కొన్నారు. గోదావరి-బనకచర్ల అనుసంధానంతో రాయలసీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని స్వర్ణకుప్పం విజన్ 2029 ద్వారా అభివృద్ధి చేస్తామని ఉద్ఘాటించారు.

1090 అర్జీలు

'జననాయకుడు' పోస్టర్ ద్వారా వచ్చిన 1090 అర్జీలను చంద్రబాబు పరిశీలించారు. ఫిర్యాదుల స్వీకరణకు 25 కౌంటర్లను ఏర్పాటు చేశారు. సిఎంకు స్వయంగా తమ సమస్యను చెప్పుకోవడానికి పెద్ద ఎత్తున అర్జీదారులు వచ్చారు. వారి నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని, అనారోగ్య సమస్యలతో ఉన్న తమకు ఆర్థిక సాయం చేయాలని కోరుతూ ఎక్కువగా అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి ప్రద్యుమ్న, ప్రభుత్వ విప్, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'కుప్పం'లో పలు శంకుస్థాపనలు

ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వర్ణకుప్పంలో భాగంగా పరిశ్రమలు, పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీ చేసుకున్న పలువురికి పరిహారాన్ని అందజేశారు. అక్కడి నుండి కంగుంది గ్రామానికి చేరుకొని శ్యామన్న విగ్రహాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామన్న కంగుంది గ్రామ సర్పంచ్‌గా, కళాకారుడిగా, ఉత్తమ రైతుగా పేరుందిన ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.

ప్రభుత్వ విద్యా రంగాన్ని బతికించుకోవాలి

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ



ప్రారంభోపన్యాసం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ



కలెక్టర్ షాన్‌మోహన్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ విద్యా రంగాన్ని బతికించుకోవాలని, దీనికి అందరూ మరింత కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ పిలుపునిచ్చారు. కాకినాడ పిఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ మంగళవారం మూడవ రోజుకు చేరింది. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రతినిధుల ప్రారంభ సభ జరిగింది. ఎంవిఎస్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కర్తవ్య నిర్వహణకు మన భావజాలం వ్యాప్తి చెందాలన్నారు. జగన్, చంద్రబాబు ఇద్దరూ నమ్మకమైన ప్రాణమిత్రులన్నారు. 2047 డాక్యుమెంట్‌లో విద్యను బలోపేతం చేయడం కానీ, ఖాళీలను భర్తీ చేయడం కానీ లేవన్నారు. ఈ రెండు రాజకీయ పార్టీలే మనకు గతి అనే భ్రమను వీడాలని సూచించారు. దేశ సమగ్రత, లౌకికతత్వం కాపాడుకోవడానికి ఉపాధ్యాయులు శాయశక్తుల కృషి చేయాలని కోరారు. సమర్థులు, విజ్ఞులు సమాజంపై బలమైన ప్రభావం చూపించకపోతే స్వార్థపరులు బలపడతారని తెలిపారు. సోషల్ మీడియాను మనం నిరేకదశించాలి తప్ప, సోషల్ మీడియాకు మనం బానిసలం కాకూడదన్నారు.

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. 50 ఏళ్ల ఉపాధ్యాయ ఉద్యమంలో తాను కూడా భాగస్వామ్యం అయినందుకు ఆనందంగా ఉందన్నారు. విద్యా వ్యవస్థను గత ప్రభుత్వం పూర్తిగా నాశనం చేసిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వమైనా గాడిలో పెట్టే ప్రయత్నం చేయాలని కోరారు. వచ్చే ఐదారేళ్లలో ప్రభుత్వ విద్యారంగం మరింత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోబోతుందన్నారు. నేటి పాలకులు భారత లౌకిక రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలోనూ, సంఘంలోనూ ఐక్యతను తీసుకురావడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. రాబోయే గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రజలతో ఉపాధ్యాయులు నిరంతరం మమేకం కావాలని సూచించారు. నిరంతరం అధ్యయనం చేయాలని, క్రియాశీలక పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.

స్వర్ణోత్సవ మహాసభకు ముఖ్య అతిథిగా కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి విచ్చేసి సౌహార్ద సందేశం చేశారు. సమాజంలో ఏదైనా మార్పు రావాలంటే గురువుల ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. తన తల్లిదండ్రులు కూడా కడప జిల్లాలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని తెలిపారు. యుటిఎఫ్ తరపున కలెక్టర్‌కు జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. తరువాత యుటిఎఫ్ సంక్షేమ పథకం బాండ్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రతినిధుల సభ జరిగింది. కార్యదర్శి నివేదికను యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, ఆర్థిక నివేదికను ఎమ్మెల్సీ గోపిమూర్తి, ఐక్య ఉపాధ్యాయ పత్రిక నివేదికను కుమార్‌రాజా ప్రవేశ పెట్టారు. వీటిపై జిల్లాల వారీగా ప్రతినిధులు చర్చించారు.



రాఘవమ్మ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు

కుడుపూడి రాఘవమ్మ కన్నుమూత

- పలువురి సంతాపం

ప్రజాశక్తి - అమలాపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

కూలి పోరాటాల ధ్రువతార కుడిపూడి రాఘవమ్మ (78) కన్నుమూశారు. మంగళవారం మధ్యాహ్నం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తొత్తరమూడిలోని ఆమె నివాసంలో తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో ఆమె బాధపడుతున్నారు. ఆమె భర్త కుడిపూడి నరసింహమూర్తి ఉపాధ్యాయుడిగా, సిపిఎంలో సభ్యునిగా పనిచేశారు. ఆయన ప్రోత్సాహంతో రాఘవమ్మ పోరాటాల బాట పట్టారు. భర్త చనిపోయినా పోరాటాలను వీడలేదు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఉదయం తొత్తరమూడిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రాఘవమ్మ మరణానికి వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, అండ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తదితరులు సంతాపం తెలిపారు.

సిపిఎం తరుపున కోనసీమలో జరిగిన పలు పోరాటాల్లో రాఘవమ్మ ముఖ్యభూమిక వహించారు. ముఖ్యంగా 1990వ దశాబ్దంలో కోనసీమలో జరిగిన కూలి పోరాటాలు, భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో ఆమె కీలక పాత్ర పోషించారు. రామచంద్రపురం, వెంకటాయపాలెంలో దళితులకు తోట త్రిమూర్తులు శిరోముండనం చేసిన ఘటన నేపథ్యంలో జరిగిన పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. సారా వ్యతిరేక ఉద్యమానికి కోనసీమలో నాయకత్వం వహించారు. సిపిఎం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ సభ్యులుగా చాలాకాలం సేవలందించారు. ఐద్వా జిల్లా అధ్యక్షులుగా, వ్యవసాయ కార్మిక సంఘానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులుగా పని చేశారు. ప్రస్తుతం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షురాలిగా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు.

మహిళలు చైతన్యం కావాలి

- 'మహిళల పురోగతి-సవాళ్లు' సదస్సులో ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే



సదస్సులో మాట్లాడుతున్న మరియం ధావలే

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించడమే కాకుండా చైతన్యవంతం కావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ప్రధాన కార్యదర్శి మరియం ధావలే పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ రమణి అధ్యక్షతన మంగళవారం కాకినాడ ఐడియల్ కళాశాల ఆవరణలో 'మహిళల పురోగతి-సవాళ్లు' సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ధావలే ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. మహిళల అభివృద్ధి అనగానే చాలా ఆలోచనలు ముందుకు వస్తాయన్నారు. అభివృద్ధికి ప్రాతిపదిక కనీస అవసరాలేనని తెలిపారు. విద్య, వైద్యం, మంచినీరు, ఆహారం, నివాసం అభివృద్ధిలో భాగమన్నారు. ఇవి సమాజంలో చాలామందికి అందడం లేదని, ముఖ్యంగా మహిళలు ఈ విషయంలో చాలా వెనుకబడే ఉన్నారన్నారు. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల ప్రభావం ప్రతి ఒక్కరిపైనా ఉంటుందన్నారు. ఓటు ఎవరికి వేస్తున్నామో ఆలోచించాలని, ఎన్నికల ముందు కులం, మతం, జాతి పేర్లతో ఓట్లు అడుగుతున్నారన్నారు. తాయిలాలు ప్రకటిస్తున్నారని, తర్వాత మర్చిపోతున్నారని గుర్తు చేశారు. మరోపక్క ధరలు విపరీతంగా పెంచి మన సొమ్ము కాజేస్తున్నారని తెలిపారు. ఉపాధి కల్పనలోనూ మహిళల పట్ల వివక్ష పాటిస్తున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలు అందుతున్నాయన్నారు. దేశాన్ని పాలిస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ప్రజలను మతపరంగా విడదీయడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్నాయని, ఆంధ్రప్రదేశ్‌లోనూ మతపరమైన విభజనకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఉచ్చులో ఏ మతస్తులైనా పడరాదని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా మహిళ లేదా ఆడపిల్లపై అత్యాచారం దాడి జరిగినప్పుడు కులం, మతం కోణం లోంచి చూడడం ఎక్కువైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మానవతా దక్పథంతో చూసి అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

శ్రామిక మహిళ రాష్ట్ర నాయకులు జి బేబిరాణి మాట్లాడుతూ మహిళల పురోగతికి ప్రభుత్వ విధానాలు ఆటంకం కలిగిస్తున్నాయన్నారు. మతోన్మాత విధానాల వల్ల మహిళలపై దాడులు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. సనాత ధర్మాన్ని కాపాడుతామంటూ పాలకులు ప్రజల సమస్యలను పక్కకు నెడుతున్నారన్నారు. ఈ సదస్సులో ఐద్వా నాయకులు పద్మ, భూలక్ష్మి, నాగలక్ష్మి, దుర్గ, పావని, జ్యోతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో కెటిఆర్‌కు నిరాశ

- క్వాష్ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కెటిఆర్‌కు హైకోర్టులో నిరాశ ఎదురైంది. తనపై ఎసిబి నమోదు చేసిన కేసును కొట్టివేయాలని ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది.

ఫార్ములా ఇ-రేసు వ్యవహారంలో ఎసిబి నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ కెటిఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం మంగళవారం తీర్పు ప్రకటించింది. కెటిఆర్‌ను అరెస్ట్ చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ఉపసంహరించింది. హైకోర్టు తీర్పుపై కెటిఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలు చేసింది.

భార్య, కుమార్తెను హతమార్చిన ఉన్మాది

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలంలో దారుణం చోటుచేసుకుంది. మద్యం మత్తులో హంతకునిగా మారి తన భార్య, కుమార్తెను హతమార్చాడో కిరాతకుడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తేలూరు తిమ్మలపల్లె గ్రామానికి చెందిన దంపతులు గంగాధర్‌రెడ్డి, శ్రీలక్ష్మి (37)లకు కుమార్తె గంగోత్రి (14) ఉన్నారు. శ్రీలక్ష్మి అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలిగా పనిచేస్తున్నారు. మద్యం మత్తులో గంగాధర్‌రెడ్డి సోమవారం రాత్రి తన భార్య, కుమార్తెలపై రాడ్డుతో దాడి చేసి, కొడవలితో నరికి చంపాడు. మంగళవారం శ్రీలక్ష్మి విధుల్లోకి రాకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్త ఫోన్ చేశారు. గంగాధర్‌రెడ్డి ఫోన్ ఎత్తి నా భార్యను చంపేశానంటూ సమాధానం ఇచ్చాడు. దీంతో ఈ విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్త పోలీసులకు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వాస్పత్రికి మృతదేహాలను తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడున్నరేళ్లకు పరిహారమా?

- ఒక్కో నిర్వాసిత కుటుంబానికి రూ.4 లక్షలకుపైగా నష్టం
- పునరావాస కాలనీలు త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి- పశ్చిమ డెస్క్, కుక్కునూరు రూరల్

'పోలవరం'లో నిండా మునుగుతున్నాం. నాడు భూముల పరిహారం జమలో పలు కోతలు పెట్టారు. తర్వాత పునరావాస ప్యాకేజీ ఇచ్చేందుకు 2016లో సర్వే నిర్వహించారు. కుటుంబానికి గిరిజనులకు రూ.6.86 లక్షలు, గిరిజనేతరులకు రూ.6.36 లక్షలుగా ప్యాకేజీ నిర్ణయించారు. 2017 జూన్ 30వ తేదీ కటాఫ్ తేదీగా నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ప్యాకేజీ వర్తింపజేస్తామని ప్రకటించారు. నాటి నుంచి నేటి వరకూ ప్యాకేజీ సొమ్ము కోసం ఎదురుచూడగా నేడు ఖాతాల్లో పడుతున్నాయి. సంతోషం లేదుకదా నిర్వేదమే మిగిలింది'.. ఇదీ ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నిర్వాసిత కుటుంబాల ఆవేదన. ప్యాకేజీ నిర్ణయించి ఏడున్నరేళ్లయిందని, నాడు నిర్ణయించిన ప్యాకేజీనే ఇప్పుడు ఇవ్వడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. నాటి ధరలు, జీవన ప్రమాణాలు తదితర అంశాల ఆధారంగా పునరావాస ప్యాకేజీ నిర్ణయించినట్లు నాడు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం ప్రకటించింది. పరిహారం పెంచాలని, యువతీ యువకులకు ప్యాకేజీ అందజేతకు కటాఫ్ తేదీ మార్చాలని నిర్వాసితులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారు. ఈలోపు ఎన్నికలు రావడంతో వైసిపి అధినేత జగన్ తాను అధికారంలోకొస్తే రూ.పది లక్షలు ప్యాకేజీ ఇస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో పోలవరం ముంపు మండలాల పరిధిలో వైసిపి ఎంఎల్ఎలే గెలుపొందారు. జగన్ నాటి నుంచి అధికారం కోల్పోయే వరకూ రూ.పది లక్షల ప్యాకేజీ అమలు చేయలేదు ఈ క్రమంలో మళ్లీ టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చింది. గత టిడిపి ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించిన ఏడున్నరేళ్ల తర్వాత ప్యాకేజీ సొమ్ము వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని 41.15 కాంటూరు పరిధిలో ముంపునకు గురయ్యే గ్రామాల్లోని కుటుంబాలకు శుక్రవారం నుంచి పునరావాస ప్యాకేజీ సొమ్ము జమవుతోంది. కుక్కునూరు మండలంలో బోనగిరి, చీరవల్లి, దామరచర్ల, గొమ్ముగూడెం, గంపనపెల్లి, కివ్వాక, కుక్కునూరు, రామచంద్రపురం సీతారామపురం మొత్తం ఎనిమిది గ్రామాలు, వేలేరుపాడు మండలంలో రుద్రంకోట, తాట్కూరుగొమ్ము, వేలేరుపాడు, రేపాకగొమ్మి, కన్నాయిగుట్ట, శ్రీరామపురం, పూచిగొంది, నాళ్లవరం కాలనీ, నాళ్లవరం, నాగులగూడెం, కొయిదా, కట్కూరు, జగన్నాథపురం, చిగురుమామిడి, బుర్రెడ్డిగూడెం మొత్తం 17 గ్రామాలు ఈ కాంటూరు పరిధిలో ఉన్నాయి. మొత్తంగా రెండు మండలాల్లో ఆరు వేలకుపైగా కుటుంబాలకు ప్యాకేజీ సొమ్ము జమ కావాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యాం పూర్తి కావడంతో గోదావరికి చిన్నపాటి వరదొచ్చినా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో చాలా గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఎట్టకేలకు ఏడున్నరేళ్ల తర్వాత పాత ప్యాకేజీ నిధులే జమవుతున్నాయి.

అప్పటి నుంచి కనీసం బ్యాంకు వడ్డీ కింద లెక్కగట్టినా సుమారు రూ.నాలుగు లక్షలకుపైగానే అంటే తమకు కుటుంబానికి రూ.11 లక్షల వరకూ రావాల్సి ఉందని వారు చెప్తున్నారు. పాత ప్యాకేజీతోనే సరిపెట్టడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. ఈ కాలంలో తరచూ వరదలు రావడంతో పనులకు వెళ్లలేక, అప్పు చేసి కుటుంబాలను నెట్టుకొచ్చామని, కనీసం ప్యాకేజీ కింద కుటుంబానికి రూ.పది లక్షలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. దీనివల్ల సకాలంలో ప్యాకేజీ ఇవ్వకపోవడం వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చటం తప్ప, అదనంగా తమకు ఇచ్చేదేమీ ఉండదని వారు అంటున్నారు.

యువతకు ప్యాకేజీకి 18 ఏళ్లు వయస్సు నిండి ఉండాలనే కటాఫ్ తేదీ 2024 డిసెంబర్ 31గా మార్చాలని కోరుతున్నారు. తమకు పునరావాస ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని నిర్వాసితులు కోరుతున్నారు.

మండలం యూనిట్‌గా పరిహారం ఇస్తే బాగుండేది



ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పునరావాస పరిహారం ఎట్టకేలకు బ్యాంకు ఖాతాలో జమైంది. ఏటా వచ్చే గోదావరి వరదలకు కుక్కునూరు గ్రామం మొత్తం ముంపునకు గురవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మండలం మొత్తం యూనిట్‌గా తీసుకుని పరిహారం ఇస్తే సంతోషంగా ఉంటుంది. ప్రభుత్వం స్పందించి అందరికీ న్యాయం చేయాలి.

-రావి శ్రీనివాసరావు, కుక్కునూరు ఎ-బ్లాక్ నిర్వాసితుడు

పునరావాస కాలనీల్లో ఉపాధి కల్పించాలి



ఏటా వచ్చే గోదావరి వరదలకు మా ఇల్లు ముంపునకు గురవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. సామాన్లు సర్దుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్లేవాళ్లం. మాకు ఇచ్చే పునరావాస కాలనీలో ఉపాధి కల్పించి న్యాయం చేయాలి.

-షేక్ గంగ, కుక్కునూరు ఎ-బ్లాక్ నిర్వాసితురాలు

జిడిపికి ధరల పోటు

- నాలుగేళ్ల కనిష్టానికి పతనం..!
- 2024-25లో 6.4 శాతమే
- ఎన్ఎస్ఒ అంచనాల వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలోని అధిక ధరల పోటు ఆర్థిక వ్యవస్థను మందగించేలా చేస్తున్నాయి. హెచ్చు ద్రవ్యోల్బణంతో ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోవడంతో ఆ ప్రభావం వృద్ధి రేటుపై స్పష్టంగా కనబడుతోంది. దీనికి నేషనల్ గణంకాల శాఖ (ఎన్ఎస్ఒ) తాజా అంచనాలు మరింత బలాన్ని చేకూర్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత జిడిపి 6.4 శాతానికి పరిమితం కావొచ్చని మంగళవారం ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. ఇది నాలుగేళ్లలోనే అత్యంత కనిష్ట స్థాయి కావడం ఆందోళనకరం. ఇంతక్రితం 2023-24లో జిడిపి 8.2 శాతం పెరిగింది. 2024-25 6.6 శాతం వృద్ధి ఉండొచ్చని ఆర్‌బిఐ ఇటీవల అంచనా వేసింది. దీంతో పోల్చినా జిడిపి మరింత తగ్గే అవకాశం ఉంది. మొదటి ముందస్తు అంచనాల మందగమనం ఆర్థిక కార్యకలాపాల మరింత పతనాన్ని స్పష్టం చేస్తోంది. వాస్తవిక జిడిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.184.88 లక్షల కోట్లకు చేరొచ్చని అంచనా. గత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.173.82 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో వృద్ధి ఏకంగా 5.4 శాతానికి పడిపోయి.. దాదాపు రెండేళ్ల కనిష్టానికి క్షీణించింది. ఆర్‌బిఐ, రేటింగ్ ఏజెన్సీల అంచనాల కంటే ఘోరంగా క్షీణించడం గమనార్హం. కేంద్ర గణంకాల శాఖ (ఎన్ఎస్ఒ) రిపోర్ట్ ప్రకారం.. క్యూ2లో మైనింగ్, గనుల రంగాలు అత్యంత పేలవ ప్రదర్శన కనబర్చాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో జిడిపి ఏకంగా 8.1 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. గడిచిన ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6.7 శాతానికి పరిమితమయ్యింది. ఈ రెండింటితోనూ పోల్చినా జిడిపిలో భారీ తగ్గుదల నమోదుకావడం ఆందోళనకరం. మరోవైపు రేటింగ్ ఏజెన్సీలు కూడా 6 శాతం ఎగువన వృద్ధి ఉండొచ్చని చేసిన అంచనాల కంటే మరింతగా పడిపోవడం విశేషం. జిడిపి 7 శాతం పెరగనుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అంచనా వేశారు. ఆర్‌బిఐ అంచనాలు మించి జిడిపి పతనం కావడం ఆర్థిక వ్యవస్థ పట్ల తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వీటిన్నిటీ పరిశీలనలోకి తీసుకుంటే భారత ఆర్థిక వ్యవస్థ బయటికి కనబడుతున్నంత బలంగా ఏమీ లేదని.. మందగమనం చాయలు స్పష్టం చేస్తోన్నాయి.

భారత్‌లో రూ.25వేల కోట్ల పెట్టుబడులు

- క్లౌడ్, కృత్రిమ మేధ సామర్థ్యాలపై దృష్టి : మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదేళ్ల వెల్లడి



న్యూఢిల్లీ : టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీ పెట్టుబడులను ప్రకటించింది. వచ్చే 2030 నాటికి 3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.25వేల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సిఇఒ సత్య నాదేళ్ల వెల్లడించారు. మంగళవారం బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో నాదేళ్ల మాట్లాడుతూ.. దేశంలో క్లౌడ్, కృత్రిమ మేధ సామర్థ్యాలను విస్తరించడం, డేటా సెంటర్ల విస్తరణ కోసం ఈ మొత్తాన్ని వ్యయం చేయనున్నామని తెలిపారు. అదే విధంగా 2030 నాటికి కోటి మందికి కృత్రిమ మేధా (ఎఐ)పై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఇది వరకు ఎప్పుడూ ఇంత పెద్ద మొత్తం పెట్టుబడులను ప్రకటించలేదని సమాచారం. ఎఐ భవిష్యత్ ఆవిష్కరణలలో కీలకంగా మారనుంది. ఈ క్రమంలోనే భారత్‌లో 3 బిలియన్ డాలర్ల పెట్టుబడికి సంతోషిస్తున్నామని నాదేళ్ల తెలిపారు. భారత్‌లో మైక్రోసాఫ్ట్‌ను మరింత విస్తరించనున్నామన్నారు. వచ్చే 2030 నాటికి కోటి మందికి ఎఐలో శిక్షణ ఇవ్వడం ద్వారా.. ఎంతో మందికి ఉపాధిని కూడా కల్పించనున్నామన్నారు. భవిష్యత్‌లో ఎఐ నిపుణుల అవసరం పెద్ద సంఖ్యలో ఏర్పడుతుందన్నారు. ఎఐలో తమ ఉద్యోగులకు మరింత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడంలో భారతీయ నిపుణులు ముందు వరుసలో ఉంటారని ప్రశంసించారు.

Bandhan Mutual Fund

బంధన్ ఎంఎఫ్ నుంచి కొత్త ఫండ్

హైదరాబాద్ : బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా 'బంధన్ నిఫ్టీ అల్ఫా లో వాలటిలిటీ 30 ఇండెక్స్ ఫండ్'ను ఆవిష్కరించింది. ఈ ఒపెన్ ఎండెడ్ స్కీమ్‌లోని నిధులను ఎంపిక చేసిన స్టాక్స్‌ల్లో పెట్టుబడులను పెట్టనున్నట్లు పేర్కొంది. ప్రస్తుత అనిశ్చితి మార్కెట్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి దోహదం చేస్తుందని ఆ సంస్థ భావిస్తోంది. ఈ ఎన్ఎఫ్ఒ జనవరి 08న ప్రారంభమై.. 20తో ముగియనుందని బంధన్ ఎఎంసి సిఇఒ విశాల్ కపూర్ తెలిపారు.

సంక్రాంతికి 7,200 ప్రత్యేక బస్సులు

- సాధారణ ఛార్జీలతోనే ప్రయాణం
- ఎపిఎస్ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు 7,200 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఎపిఎస్ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక బస్సులైనప్పటికీ అదనపు ఛార్జీలు లేకుండా, సాధారణ ఛార్జీలతోనే ప్రయాణం చేయొచ్చని, రానూపోనూ టిక్కెట్ ఒకేసారి బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఇస్తారని పేర్కొన్నారు. ప్రత్యేక బస్సు సర్వీసులు ఈ నెల 8 నుంచి 13 వరకు, 16 నుంచి 20వ తేదీ వరకు నడిపేందుకు ఆర్‌టిసి సిద్ధమైందన్నారు. ఇప్పటికే ఈ నెల 10 నుంచి 12 వరకూ అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అయ్యాయన్నారు. ప్రత్యేక సర్వీసుల పర్యవేక్షణకు జిల్లా ముఖ్య కేంద్రాలతోపాటు హైదరాబాద్‌లోని పలు పాయింట్ల వద్ద అధికారులు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. బస్సుల సమాచారం కోసం కాల్ సెంటర్ నెంబరు 149 లేదా 0866-2570005 నెంబరు 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. సంక్రాంతికి ముందు రోజు వరకు తిరిగే బస్సులకు అదనంగా 3,900 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అందులో హైదరాబాద్ నుంచి 2,153 బస్సులు, బెంగళూరు నుంచి 375, చెన్నై నుంచి 42, విజయవాడ నుంచి 300, విశాఖపట్నం నుంచి 250, రాజమండ్రి నుంచి 230, తిరుపతి నుంచి 50, ఇతర ప్రాంతాల నుంచి 500 బస్సులు రాష్ట్రంలోని పలు పట్టణాలకు నడుస్తాయన్నారు. తిరుగు ప్రయాణం కోసం 3,300 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జిఓ 1 పట్ల ఎపిపిటిడి కార్మిక పరిషత్ హర్షం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపిఎస్ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగులకు ఇహెచ్ఎస్ ద్వారా వైద్య సేవలందించేందుకు వీలుగా ప్రభుత్వం జిఓ ఎంఎస్ నెంబరు ఒకటిని విడుదల చేయడం హర్షణీయమని ఎపిఎస్ఆర్‌టిసి (ఎపిపిటిడి) కార్మిక పరిషత్ పేర్కొంది. ఈ మేరకు కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌వి శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్య సేవలు ఇహెచ్ఎస్ ద్వారా అందించేందుకు నిర్ణయం తీసుకున్న సిఎం చంద్రబాబు, రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రూ'పాయే'!

ముంబయి : ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువ తగ్గింది. మంగళవారం డాలర్‌తో రూపాయి విలువ ఐదు పైసలు పతనమై డాలర్‌తో 85.73 కనిష్ట స్థాయికి దిగజారింది. హెచ్చు చమురు ధరలు, విదేశీ సంస్థాగత నిధులు తరలిపోవడం రూపాయిపై ఒత్తిడిని పెంచాయి. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో 85.77 వద్ద తెరుచుకున్న రూపాయి విలువ.. ఇంట్రాడేలో ఏకంగా 85.80 కనిష్ట స్థాయిని తాకింది. ఇంతక్రితం సెషన్‌తో పోల్చితే 5 పైసలు తగ్గి 85.73 వద్ద ముగిసింది. సోమవారం సెషన్‌లో 11 పైసలు పెరిగి 85.68 వద్ద నమోదయ్యింది.

మార్కెట్లకు స్వల్ప ఉపశమనం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లకు స్వల్ప ఉపశమనం లభించింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాల నేపథ్యంలో మంగళవారం బిఎస్ఇ సెన్సెక్స్ 234.12 పాయింట్లు లేదా 0.30 శాతం పెరిగి 78,199కి చేరింది. ఇంట్రాడేలో 78,452-77,925 మధ్య కదలాడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 92 పాయింట్ల లాభంతో 23,707 వద్ద ముగిసింది. సోమవారం సెషన్‌లో సెన్సెక్స్ 1258 పాయింట్లు, నిఫ్టీ 389 పాయింట్ల చొప్పున పతనం అయ్యాయి. ఈ భారీ నష్టాల నుంచి మదుపర్లకు కాస్త ఊరట లభించినట్లయ్యింది.

మారుతి సుజుకి 'ఇ ఫర్ మీ' విజన్

న్యూఢిల్లీ : దిగ్గజ వాహన రంగ కంపెనీ మారుతి సుజుకి విద్యుత్ వాహన రంగంలోని విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవడానికి 'ఇ ఫర్ మీ' విజన్‌ను ఎంచుకున్నట్లు వెల్లడించింది.

ఇందులో భాగంగా తొలి ఎస్‌యువి ఎలక్ట్రిక్ వాహనం ఇ విటారాను ఆవిష్కరించనున్నట్లు తెలి పింది. ఈ వాహనాన్ని త్వరలో న్యూఢిల్లీలో జరగనున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ఆవిష్కరించనున్నట్లు పేర్కొంది. ఇ ఫర్ మీలో భాగంగా ఇవిలో మౌలిక వసతు లకు కూడా మద్దతును అందించనున్నట్లు పేర్కొంది.

జయహో పుస్తకం..వైభవంగా మహోత్సవం

ప్రజాశక్తి, అమరావతి బ్యూరో :
సృజనాత్మక శక్తులను పెంపొందించే అభ్యుదయ రచనలు, సైన్స్, కథలు, గొప్ప వ్యక్తుల జీవితచరిత్రలు, కథలు, కళలు, పిల్లల కథలు, విజ్ఞానదాయకమైన పుస్తకాలెన్నో విజయవాడ పుస్తకమహోత్సవంలో సాక్షాత్కరించాయి. మనిషి ఉన్నంత వరకూ అక్షరం ఉంటుందని, అక్షరం అంతం కాదని పలువురు పుస్తక ప్రియులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. వారి అమూల్యమైన అభిప్రాయాలు, అనుభవాలు వారి మాటల్లో....



63 సంవత్సరాలుగా..



గత 63 సంవత్సరాలుగా పుస్తక ప్రచురణల రంగంలో ముందుకు సాగుతున్నాం. మా సంస్థ ద్వారా ఆంధ్రా, ఒడిశా, తెలంగాణ, కర్ణాటక, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లోని పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లోని లైబ్రరీలకు పుస్తకాలను సరఫరా చేస్తున్నాం.
-ముదిలి శ్రీనివాసరావు, హిమాన్షు పబ్లికేషన్స్

అభినందనీయం



విజయవాడలో గత కొన్నేళ్లుగా పుస్తక మహోత్సవ కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తుండటం అభినందనీయం. విజయవాడ, విశాఖపట్టణంలలో మాత్రమే కాకుండా పట్టణాలకు కూడా పుస్తక మహోత్సవాన్ని తీసుకెళ్లాల్సిందిగా నిర్వాహకు లకు నా మనవి.
-డాక్టర్ పెనుగొండ లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

సాంకేతి విప్లవం ద్వారా భాషలు కరుమరుగు కావు



సాంకేతికత, సాంకేతిక విప్లవం ద్వారా భాషలు కనుమరుగు కావు. సాంకేతికతను ఉపయోగించు కుంటూనే పుస్తకాభిలాషను కొనసాగించాలి. మేము ఇలా పుస్తకాలను చదివే ఈ స్థాయికి వచ్చాం. అందువల్ల నేటితరం పిల్లలు, యువత పుస్తక పఠనాన్ని పెంపొందించుకోవాలి.
-రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, కేంద్రప్రభుత్వ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అనంతపురం

ఆసక్తి పెరుగుతుంది



అయితే భాష పరిపుష్టం కావటానికి పుస్తక పఠనం నిరంతరం అవసరం. పుస్తక మహోత్సవంలో అనేక మంచి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పిల్లలకు ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలు చేయించే పుస్తకాలు ఉన్నాయి.
-ఎస్‌ఆర్. పరిమి, అధ్యక్షులు, వికాస విద్యావనం, పోరంకి

అక్షరానికి అంతం లేదు



అక్షరం అంతం కాదు. భాషలు కనుమరుగు కావు. సాహిత్యం ఎప్పుడూ చిరస్థాయిగా నిలుస్తుంది. పాఠకులు మెచ్చేలా మంచి సాహిత్యాన్ని అందించేందుకు మా వంతుగా ముద్రణల ద్వారా కృషి చేస్తున్నాం.
-విశ్వేశ్వరరావు, శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత, విజయవాడ

భాషల పరిరక్షణకు దోహదం

గతేడాది ఆఖరిలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభ విజయవాడలో మూడు రోజులపాటు నిర్వహించాం. భాషలు, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణే ధ్యేయంగా ఈ సభలు జరిగాయి. పుస్తకం అనేది ఓ ఆయుధంగా [illegible] ఒంటరితనాన్ని పోగొట్టే గొప్పనేస్తంగా [illegible] పుస్తక పఠనాన్ని పెంపొందించడానికి ఇలాంటి పుస్తక మహోత్సవాలు ఎంతగానో దోహదపడతాయి.
-డాక్టర్ జి.వి.పూర్ణచంద్, ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి

మంచి ఆదరణ



270 స్టాళ్లతో ఈ ఏడాది నిర్వహించటం సంతోషంగా ఉంది. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పుస్తక ప్రియులు వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాం.
-బెల్లపు బాబ్జీ, గౌరవాధ్యక్షులు, విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ

ఊహించనిస్థాయిలో స్పందన

పుస్తక ప్రియుల నుంచి విశేషమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా యువత ఎక్కువగా స్టాళ్లలో సందర్శించడం మేము గమనించాం. ప్రజాశక్తి బుక్‌హౌస్ ద్వారా ఏర్పాటుచేసిన స్టాల్‌లో పిల్లలు, పెద్దలు, యువత, మహిళలు ఇలా అందరికీ ఉపయోగపడే అనేక రకాలైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కమ్యూనిజం పుస్తకాలకు కూడా మంచి ఆదరణ లభిస్తోంది.
- కె. లక్ష్మయ్య, జనరల్ మేనేజర్, ప్రజాశక్తి బుక్‌హౌస్

ఉచితాలకు డబ్బులుంటాయి.. న్యాయమూర్తుల జీతాలు, పెన్షన్ల కోసం ఉండవా..?

- ఢిల్లీ ఎన్నికలకు ముందు సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్య

న్యూఢిల్లీ : "న్యాయమూర్తులకు జీతాలు చెల్లించే విషయంలో ప్రభుత్వాలు ఆర్థిక పరిమితుల గురించి మాట్లాడతాయి" అని న్యాయమూర్తుల జీతాల కేసును విచారిస్తున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. ఉచితాల పంపిణీ చేయడానికి ప్రభుత్వాల వద్ద డబ్బు ఉందని, కానీ న్యాయమూర్తుల జీతాలు, పెన్షన్లు చెల్లించడానికి కాదని పేర్కొంది. 'కొందరు రూ. 2100, మరికొందరు రూ. 2500 ఇస్తున్నట్లు మాట్లాడుతున్నారు' అని ఢిల్లీ ఎన్నికల్లో చేస్తున్న ప్రకటనలను కూడా ఎస్సీ బెంచ్ ప్రస్తావించింది. న్యాయమూర్తుల జీతం, పదవీ విరమణ ప్రయోజనాలపై అఖిల భారత న్యాయమూర్తుల సంఘం 2015లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. న్యాయమూర్తులకు సకాలంలో వేతనాలు అందడం లేదని, పదవీ విరమణ తర్వాత న్యాయమూర్తులు పొందే ప్రయోజనాలను కూడా అందుకోవడం లేదని [illegible] తెలిపింది. ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసీహ్ విచారించారు.

న్యాయమూర్తుల జీతాల గురించి మాట్లాడితే ఆర్థిక సంక్షోభం ప్రస్తావన..

న్యాయమూర్తులకు జీతాలు చెల్లించే విషయంలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభం గురించి మాట్లాడుతుందని, అయితే ఎన్నికలు వచ్చినప్పుడు లాడ్లీ బెహనా , ఇతర పథకాలను అమలు చేస్తామని ఎస్సీ బెంచ్ పేర్కొంది. ఢిల్లీలో చూస్తే ఇక్కడ కూడా పార్టీలు అధికారంలోకి వస్తే రూ.2100, రూ.2500 ఇస్తామని చెబుతున్నాయని ధర్మాసనం పేర్కొంది.

ఆరోగ్యశ్రీ నిర్వీర్యానికి కుట్ర

- హైబ్రిడ్ మోడల్ సరికాదు
- మాజీ మంత్రి విడదల రజని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదల కోసం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందకుండా చేసేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ మంత్రి విడదల రజని ఆరోపించారు. గుంటూరులోని తన నివాసంలో ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించకపోవడం వల్ల ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, పథకాన్ని యథాతథంగా కొనసాగేలా చూడాలని కోరారు. ఆరోగ్యశ్రీలో మార్పు ఏ మాత్రమూ సరికాదన్నారు. పేదలు అనారోగ్యం పాలైతే మానవతా దృక్పథంతో ఆదుకోవాలే తప్ప ట్రస్ట్ మోడల్‌లో ఉన్న ఆరోగ్యశ్రీని హైబ్రిడ్ మోడల్‌లోకి మార్చడం తగదన్నారు. 2014 నుంచి 2019 వరకు కేవలం 1059 వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించారు.. 2019 నుంచి 2024 వరకు 3257 వ్యాధులకు చికిత్స అందించామని తెలిపారు. పథకంలో కవరేజీని రూ.25 లక్ష వరకు పెంచినట్లు చెప్పారు. 2019లో టిడిపి ప్రభుత్వం రూ.632 కోట్లు బకాయిలు పెట్టి వెళ్లిపోగా తమ ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఏకంగా రూ.3 వేల కోట్లు బకాయి పెట్టడంతో.. అవన్నీ వైద్యాన్ని నిలిపేశాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. హైబ్రిడ్ మోడల్‌తో ఇన్సూరెన్స్ కంపెనీలకే లాభమని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

10 నుంచి 19 వరకూ వైకుంఠ ద్వార దర్శనం


- 9న ఎస్ఎస్‌డి టోకెన్ల జారీ : టిటిడి ఇఒ

ప్రజాశక్తి - తిరుమల
తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి ఇఒ జె శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 10 నుండి 19 వరకు పది రోజుల పాటు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరచి ఉంటాయన్నారు. 10న ఉదయం 4.30 గంటలకు ప్రోటోకాల్ దర్శనాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 9, 10, 11, 12 తేదీలకు సంబంధించి 1.20 లక్షల టోకెన్లు యాత్రికులకు కేటాయిస్తామన్నారు. 13 నుంచి 19వ తేదీ వరకూ ఏరోజుకారోజు సామాన్య యాత్రికులకు టోకెన్లు జారీ చేస్తామని చెప్పారు. దాదాపు ఏడు లక్షల మందికి పైగా వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒలు గౌతమి, వీరబ్రహ్మం, తిరుపతి ఎస్‌పి సుబ్బరాయుడు, సివిఎస్ఒ శ్రీధర్ పాల్గొన్నారు.
తిరుమల శ్రీవారి ఆలయంలో 10న వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది.

ఉత్తరప్రదేశ్‌లో తప్పుడు 'మత మార్పిడుల' కేసులు

- దళిత మెకానిక్‌పై హిందూత్వ మూకల దాడి
- చేయని తప్పునకు 15 నెలల జైలు

న్యూఢిల్లీ : అది 2023వ సంవత్సరం జూన్ 25వ తేదీ. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీలో కోద్రా గ్రామం. 35 సంవత్సరాల సోనూ సరోజ్‌కు అందరి లాగానే ఆ ఆదివారం కూడా ప్రారంభమైంది. ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, సమీప గ్రామాల ప్రజలు ఇంటి వెనుక ఉన్న ఓ బహిరంగ ప్రదేశంలో ప్రార్థనల కోసం సమావేశమయ్యారు. దళితుడైన సరోజ్ ఓ మెకానిక్. ఆయన తరచూ క్రైస్తవ ప్రార్థనలు నిర్వహిస్తూ ఉంటారు. ఉదయం 11 గంటలకు ప్రార్థనా సమావేశం మొదలైంది. 250 మంది హాజరయ్యారు. మరికొందరు ఆ ప్రాంతానికి చేరుకుంటున్నారు. ఆ సమయంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్‌కు చెందిన 10-15 మంది హిందూత్వ వాదులు అక్కడికి చేరుకొని బీభత్సం సృష్టించారు. లాఠీలు, కర్రలు పట్టుకొని అందరికీ కొట్టడం ప్రారంభించారు. సరోజ్ భార్య పట్ల కూడా అవమానకరంగా ప్రవర్తించారు. ఆమె తలపై లాఠీతో కొట్టడంతో తీవ్ర గాయమైంది. స్థానిక హిందువులను క్రైస్తవులుగా మార్చేందుకు సరోజ్ అనధికారికంగా ప్రార్థనా సమావేశాలు నిర్వహిస్తున్నారంటూ ఆరోపించారు. దాడికి పాల్పడిన అల్లరి మూకలపై చర్య తీసుకోవాల్సిన పోలీసులు సిఆర్‌పిసి సెక్షన్ 151 కింద కేసు పెట్టి సరోజ్‌ను జైలుకు పంపారు. గుర్తించదగిన నేరం చేసేందుకు పథకం పన్నుతున్నారని భావిస్తే వారంట్ కానీ లేదా మెజిస్ట్రేట్ ఆదేశాలు కానీ లేకుండానే వారిని అరెస్ట్ చేసే అధికారం ఈ సెక్షన్ ద్వారా పోలీసులకు లభిస్తోంది. ఈ సెక్షన్‌తో పాటు మత మార్పిడుల నిరోధక చట్టంలోని సెక్షన్ 3, 5(1) కింద కూడా కేసు నమోదు చేశారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం 2020లో ఆర్డినెన్స్ రూపంలో ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. 2020 నవంబర్ నుండి గత ఏడాది జూలై 31 వరకూ మత మార్పిడుల నిరోధక చట్టం కింద ఉత్తరప్రదేశ్‌లో 835 క్రిమినల్ కేసులు నమోదు చేసి 2,700 మందిని అరెస్ట్ చేశారు. వారిలో సరోజ్ ఒకరు. ఈ చట్టాన్ని ప్రయోగించి యోగి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందని హక్కుల కార్యకర్తలు, ప్రతిపక్షాలు, న్యాయవాదులు విమర్శించినా ప్రభుత్వంలో చలనం లేదు. చట్టం కింద నమోదు చేస్తున్న కేసుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ శిక్షలు పడిన సందర్భాలు చాలా తక్కువే. తప్పుడు ఆరోపణలు మోపి కేసులు పెట్టిన పోలీసులపై బరేలీ కోర్టు చట్టపరమైన చర్యలకు ఆదేశించిన సందర్భం కూడా ఉంది.
సరోజ్‌పై కేసు పెట్టి జైలుకు పంపిన పదిహేను నెలల తర్వాత ఆయనను న్యాయస్థానం నిర్దోషిగా విడిచిపెట్టింది.



కోతి - అద్దం



కోతికి అద్దం దొరికింది
చేతిన చక్కగా పట్టింది!
ముఖం ముద్దుగా చూసింది
మురిసి మురిసి గెంతు లేచింది!

అద్దం గట్టిగా పట్టింది
చక చక చెట్టును ఎక్కింది!
మరలా ముఖమును చూసింది
ఆనందంగా కొమ్మన కూర్చుంది!

వాయిసమొకటి వాలింది
అద్దమున మోము చూసింది !
కావ్ కావ్ అని అరిసింది
కోతితో స్నేహం చేసింది!

అద్దం సంగతి తెలిసింది
రామచిలుక వచ్చింది!
అద్దంనెంతో మెచ్చింది
కోతిని బాగా పొగిడింది!

పావురం మురిసింది
కోకిలమ్మ నచ్చింది!
కోతికి ఆదరణ పెరిగింది
తానే గొప్పని మిడిసి పడింది!

ఒకరోజు అద్దం పట్టు జారింది
కిందపడి పగిలి ముక్కలయ్యింది!
కోతికి చాలా బాధ కలిగింది
పడి పడి మరీ ఏడ్చింది!


అద్దం కోసమె వచ్చే అందరూ
ఓదార్పుకు కూడా కరువయ్యారు
కోతికి సత్యం తెలిసొచ్చింది
మిడిసిపాటును విడిచి పెట్టింది!

- మొర్రి గోపి కవిటి,
శ్రీకాకుళం జిల్లా,
88978 82202.

లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 186



నేను గీసిన బొమ్మ





ఎస్. కె. జుబీర్,
5వ తరగతి,
ఏ.బి.ఎస్ పబ్లిక్ స్కూల్,
అగనంపూడి,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పుస్తకం వైపు యువత చూపు

'కొంతమంది యువకులు రాబోవు యుగం దూతలు.. పావన నవజీవన బృందావన నిర్మాతలు బానిస పంథాలను తలవంచి అనుకరించరు పోనీ, అని అన్యాయపు పోకడలు సహించరు' అన్న శ్రీశ్రీ మాటలను నేటి యువతీ యువకులు కొందరు నిజం చేస్తున్నారు. నేటి తరం సాహిత్యాన్ని పట్టించుకోవటం లేదనే వాదనను పటాపంచలు చేస్తున్నారు. భాష ఏదైనా సాహిత్య పిపాసులుగా నేటి యువతీ యువకులు ముందుకు దూసుకొస్తున్నారు. ఇలాంటి వారికి వేదికగా 35వ విజయవాడ పుస్తక మహోత్సవం (ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం) నిలిచింది. సందర్శకులతోపాటుగా బుక్‌స్టాల్స్ నిర్వహణలోనూ, రచన, ప్రచురణ ప్రక్రియల్లోనూ చాలామంది యువత చాలా స్టాళ్లల్లో కనిపిస్తున్నారు.

ఈ పుస్తక మహోత్సవంలో మొత్తంటా 270 స్టాళ్లు ఏర్పాటు చేశారు. చిన్న పిల్లల పుస్తకాల నుంచి పెద్దల వరకూ, మహిళలు, యూనివర్శిటీ, రీసెర్చ్, వైద్యం, కంప్యూటర్, ఇంజనీరింగ్, ఎఐ, ఎంఐ వంటి సబ్జెక్టు, సాహిత్యం, కథలు, కవితలు, చరిత్ర, జనరల్‌నాలెడ్జ్, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పుస్తకాలు, విదేశీ భాషలకు సంబంధించిన పుస్తకాలు సైతం ఇక్కడ కొలువు తీరాయి. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు అవసరమైన పోటీపరీక్షల మెటీరియల్ ఇక్కడ అందుబాటులో ఉంది. ఆయా స్టాళ్లలో ఎక్కువ మంది యువత కనిపిస్తుండటం ద్వారా సాహిత్యానికి ఏమాత్రం ఆదరణ తగ్గలేదనేది స్పష్టమవుతోంది.

నలుగురు యువకుల 'కథ'

ఆకర్షణీయమైన ఉద్యోగాలను సైతం వదిలి పెట్టి 'కథల' ఊతంతో పాఠశాల విద్యలో నూతన ఒరవడిని సృష్టిస్తున్నారు కాకినాడకు చెందిన నలుగురు యువకులు. వారే రవి, వంశీ, సిద్ధు, సుదర్శన్. విద్యారంగంపై ఆసక్తితో ఈ నలుగురు మిత్రులు కలిసి చేస్తున్న వినూత్న ప్రయత్నమే 'టేల్స్ టు టీచ్' అనే అంకుర సంస్థ. 'లెర్న్ త్రూ స్టోరీస్' అనేది వీరి నినాదం. పాఠశాల స్థాయి సబ్జెక్టులను సైతం విద్యార్థులు సులువుగా నేర్చుకునేందుకు ఉపయోగపడే కథల పుస్తకాలను వీరు రూపొందిస్తున్నారు. బట్టీ పట్టే విధానాన్ని దూరం చేయడానికి, సైన్సు, లెక్కలు, సోషల్ వంటి సబ్జెక్టుల పై పిల్లలకు ఆసక్తి పెంచడానికి, ఆయా అంశాలను కథల రూపంలో అందిస్తున్నారు. కథల ద్వారా నేర్చుకోవడం వల్ల చదివింది చాలా కాలం పాటు గుర్తుంటుందని, భాష, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు మెరుగుపడతాయని పలు నివేదికలు కూడా తెలుపుతున్నాయి. వీరు రూపొందించిన 'హలో డాక్టర్', 'ద సైంటిస్ట్ గ్రాండ్ పా' కథల పుస్తకాలు రైటర్స్ స్టాల్ (స్టాల్ నంబర్ 43)లో ప్రదర్శన, కొనుగోలుకు ఉంచారు. హైదరాబాద్ బుక్ ఫెస్టివల్‌లో విశేష ఆదరణను పొంది 600 కాపీలు అమ్ముడైన ఈ కథల పుస్తకాలు, విజయవాడ బుక్ ఫెస్టివల్‌లో సైతం పిల్లలను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. చిన్ని చిన్ని కథల ద్వారా అత్యంత విలువైన జీవిత పాఠాలు నేర్చుకోవచ్చునని చాటిచెప్పిన 'పంచతంత్ర'ను స్ఫూర్తిగా తీసుకుని, కథల ద్వారా సైన్స్, లెక్కలు, ఇతర క్లిష్టమైన సబ్జెక్టులను వివరిస్తున్నట్టు వారు చెబుతున్నారు. మరిన్ని కథల పుస్తకాల ద్వారా పిల్లల నైపుణ్యాలను, జ్ఞానాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమని ఈ యువకులు చెబుతున్నారు.



రవి, వంశీ

వంశీకృష్ణ రైల్వే డిఆర్ఎం కార్యాలయంలో అకౌంట్స్ విభాగంలోనూ, రవితేజ పోస్టల్ బ్రాంచ్‌మాస్టర్‌గానూ, సిద్ధార్థ ఇంజనీర్, సుదర్శన్ అరబిందో ఫార్మాలో రీసెర్చ్ విభాగంలో పనిచేశారు. సాహిత్యంపై తమకున్న అభిమానంతో తమ ఉద్యోగాలను వదిలి, సాహిత్యరంగంలోకి అడుగు పెట్టారు.

ది గ్రేట్ ఇండియన్ ట్రెజర్, ది ఐడియా రిజల్యూషన్‌కు ఆదరణ

హైదరాబాద్‌కు చెందిన రఘునందన్ వడ్ల టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయన రాసిన ది గ్రేట్ ఇండియన్ ట్రెజర్, ది ఐడియా రిజల్యూషన్ పుస్తకాలు పుస్తక మహోత్సవంలో హాట్‌కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. భారత స్వాతంత్ర్య సంగ్రామంలోనూ, అనంతరం పరిణామాల్లోనూ నేటి యువత స్ఫూర్తిపొందటానికి ఎలా ప్రేరణ పొందాలో ఈ పుస్తకాల్లో ప్రేరణాత్మకమైన కథలుగా మలిచారు.



రఘునందన్ వడ్ల

రైటర్స్ స్టాల్‌లో సరికొత్తగా...

42 నుంచి 43 వరకూ ఉన్న స్టాళ్లలో రచయితలు రాసిన పుస్తకాలను వారే విక్రయించుకుంటున్నారు. 56 మంది రచయితల పుస్తకాలను ఈ స్టాళ్లలో ఉంచారు. రచయితలే స్వయంగా సందర్శకులకు తమ పుస్తకాల గురించి వివరిస్తున్నారు. అక్కడికి వచ్చే రచయితలు, కవులు, కళాకారులు వారితో ఫొటోలు దిగి కరచాలనాలు చేస్తూ సంతోషంగా గడుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, ఈ స్టాల్‌ను సమన్వయం చేస్తున్నారు. 157వ స్టాల్‌లో అజూ పబ్లిషర్స్ ప్రచురించిన 'అమ్మడైరీలోని కొన్ని పేజీలు' నవల విరివిగా అమ్ముడవుతోంది.





రాజ్యాంగం, అంబేద్కర్, కారల్‌మార్క్స్ పుస్తకాలకు ఆదరణ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలనే కుతంత్రాలు పన్నుతున్న వేళ, ఈ పుస్తక మహోత్సవంలో భారత రాజ్యాంగం, రాజ్యాంగ పీఠికలు, చట్టాలు తదితర పుస్తకాలకు ఎక్కువగా ఆదరణ కనిపిస్తోంది. సందర్శకులు ఎక్కువగా ఈ తరహా పుస్తకాలు, వాటికి సంబంధించిన లేటెస్ట్ బుక్స్, విమర్శనా గ్రంథాలను సైతం కొనుగోలు చేస్తున్నారు. డాక్టర్ అంబేద్కర్ రచించిన ఇతర పుస్తకాలకు, కారల్‌మార్క్స్ రచనలకు ఈ పుస్తక మహోత్సవంలో ఆదరణ కనిపిస్తోంది. 40 ఏళ్ల దాటని యువతీ యువకులు తాజాగా రాసిన దాదాపు వంద కథ, నవల, కవితా సంపుటాలు ఈ ఫెస్టివల్‌లో లభ్యమవుతున్నాయి. సందర్శకుల్లోనూ పెద్ద సంఖ్యలో యువతీ యువకులు. పిల్లలను వెంట తీసుకొస్తున్న తల్లిదండ్రులు కనిపిస్తున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

రంగవల్లి



13 చుక్కలు 7 వరుసకు (సరి చుక్క)



పి.వి.ఎల్.సుజాత,
సైనిక్‌పురి,
సికింద్రాబాద్.

మా చిరునామా
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496



13 చుక్కలు 7 వరుసకు (సరి చుక్క)

ఎం.సుప్రజ,
10వ తరగతి,
సిద్ధార్థ కాన్వెంట్,
భటిప్రోలు. బాపట్ల.



'సంక్రాంతికి వస్తున్నాం' కుటుంబ ప్రేమ కథాచిత్రం : వెంకటేష్

"సంక్రాంతికి వస్తున్నాం' సినిమా పూర్తిగా ప్రేమ కథా చిత్రం. సంక్రాంతి పండుగలో ఈ సినిమా బాగా అలరిస్తుంది. ఇంట్లోని కుటుంబ సభ్యులంతా సినిమాకు వెళ్లి హాయిగా చూడొచ్చు. మంచి కుటుంబ, ప్రేమ, ఆప్యాయతలు, అనుబంధాలకు ఇందులో దర్శకుడు అనిల్ రావిపూడి ప్రాధాన్యత ఇచ్చారు. నాతోపాటుగా మిగతా నటీనటులంతా ఎంతో చక్కగా ప్రతిభ కనబర్చారు. అందరూ ఈ సినిమాను బాగా ఆదరించి విజయవంతం చేయాలని కోరుతున్నాం. ఈ సంక్రాంతికి వస్తున్న గేమ్ చేంజర్, డాకు మహారాజ్ వంటి సినిమాలు కూడా విజయం సాధించాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నా. 'దిల్'రాజు, శిరీష్‌లతో ఇంకా మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. 'మా సంక్రాంతికి వస్తున్నాం' చూడండి..మామూలుగా ఉండదు' అని నటుడు వెంకటేష్ అన్నారు. కథానాయకుడు వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' ఈనెల 14న విడుదల కానుంది. మీనాక్షీచౌదరి, ఐశ్వర్యారాజేష్ కథానాయికలు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ ఈ సినిమాను నిర్మించారు. మూవీట్రైలర్ విడుదల కార్యక్రమం నిజామాబాద్‌లో జరిగింది. నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు అనిల్ రావిపూడి, కథానాయికలు మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యరాజేష్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిత్రయూనిట్ ప్రతినిధులంతా హాజరయ్యారు.





'1000 వర్డ్స్..' మంచి కథ


అరవింద్ కృష్ణ, బిగ్ బాస్ ఫేమ్ దివి, మేఘన శ్రీనివాస్, వినయ్ కీలక పాత్రల్లో నటించిన కొత్త చిత్రం '1000 వర్డ్స్'. ఈ సినిమాకు రమణ విల్లర్ట్ నిర్మాతగా వ్యవహరిస్తూ డైరెక్షన్ చేశారు. కే రవి కృష్ణా రెడ్డి కో-ప్రొడ్యూసర్‌గా పని చేశారు. ఈ సినిమాకు డా.సంకల్ప్ కథ, డైలాగ్స్, స్క్రీన్ ప్లే అందించగా.. శివ కృష్ణ సంగీతం అందించారు. తాజాగా చిత్రబృందం ఏర్పాటు చేసిన ఈ సినిమా ప్రత్యేక ప్రదర్శనకి రేణూ దేశాయ్, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చి రెడ్డి, మధుర శ్రీధర్, జ్యోతి పూర్వాజ్, ముఖ్య అతిథులుగా విచ్చేశారు. షో అనంతరం రేణూ దేశాయ్ మాట్లాడుతూ 'ఈ మూవీ అద్భుతంగా అనిపించింది. ఇది అందరికీ రీచ్ అవ్వాలి. అందరూ చూడాల్సిన, అందరికీ తెలియాల్సిన సినిమా. ఒక్క ఫోటో మీద ఇంత మంచి కథను రాసుకుని తీశారు. సినిమా చూశాక నాకు కన్నీళ్లు వచ్చాయి. ఇంత మంచి సినిమా తీసిన టీమ్‌కు ఆల్ ది బెస్ట్. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరు కుంటున్నాను' అన్నారు. ఎస్వీ కష్ణారెడ్డి మాట్లాడుతూ.. '1000 వర్డ్స్' అద్భుతమైన చిత్రం. అందరినీ కంటతడి పెట్టించారు. ఈ చిత్రానికి కచ్చితంగా అవార్డులు వస్తాయి. ప్రతీ ఒక్కరి హృదయాల్ని కుదిపేస్తుంది. చాలా రోజులకు ఓ చక్కటి సినిమాను

రామ్‌చరణ్ రూ.10 లక్షల ఆర్థికసాయం



రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన 'గేమ్‌ఛేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో కాకినాడ జిల్లా గైగోలుపాడుకు చెందిన అరవ మణికంఠ (23), తోకాడ చరణ్ (23) మృతిచెందారు. వాళ్లిద్దరూ బైక్‌పై వెళ్తున్న సమయంలో వడిశలేరులో ప్రమాదవశాత్తు వ్యాన్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. తన అభిమానులు ప్రమాదంలో మృతిచెందటంపై రామ్‌చరణ్ తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. మృతిచెందిన రెండు కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున రూ.10 లక్షలు ఆర్థిక సాయాన్ని అందజేస్తామని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు.

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో 'కంగువా'



97వ ఆస్కార్ బరిలో సత్తా చాటేందుకు దక్షిణాది నుండి పలు సినిమాలు పోటీలో దిగేందుకు సిద్ధమయ్యాయి. వాటిల్లో సూర్య 'కంగువా' ఆస్కార్ బరిలోకి నిలిచింది. దీంతో పాటు పృథ్వీ రాజ్ సుకుమారన్ హీరోగా నటించిన 'ది గోట్ లైఫ్' కూడా ఆస్కార్‌లోకి ఎంట్రీ దక్కించుకుంది. ఇండియా నుంచి ప్రస్తుతం ఆస్కార్ 2025 కోసం షార్ట్ లిస్ట్ చేసిన సినిమాల్లో 'ఆడు జీవితం', 'కంగువా' 'సంతోష్', 'స్వాతంత్ర్య వీర సావర్కర్' ,'ఆల్ వుయ్ ఇమాజిన్ యాజ్ లైట్'(మలయాళం) చిత్రాలు ఉన్నాయి. షార్ట్ లిస్ట్ అయిన సినిమా నుంచి ఆస్కార్ ఫైనల్ నామినేషన్లను ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియ జనవరి 8 నుంచి 12 వరకు జరుగుతుంది. జనవరి 17న నామినేషన్లను అనౌన్స్ చేస్తారు.



80 శాతం 'ఆ రోజు ఏం జరిగిందంటే..' పూర్తి

శ్రీ స్వర్ణ వరల్డ్ మూవీస్ బ్యానర్‌పై బి.నాగవర్ధనీ సమర్పణలో మూర్తీ నంబర్ వన్ ద్విపాత్రాభినయంలో వస్తున్న సినిమా 'ఆరోజు ఏం జరిగిందంటే'. ఇప్పటికే 80 శాతం సినిమా షూటింగ్ పూర్తయ్యింది. తుది షెడ్యూల్‌ను కూడా తెరకెక్కించేందుకు చిత్ర యూనిట్ ఏర్పాట్లు చేస్తోంది. సంక్రాంతి తర్వాత మిగతా పార్టు పూర్తిచేస్తామని దర్శకుడు మూర్తి తెలిపారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మూర్తి బాందేపురపు. నిర్మాత ఎం.మల్లిబాబు. సంగీతం చదివే దేవేంద్ర, కొరియోగ్రఫీ శేఖర్, ఎడిటింగ్ అవినాష్. డిఒపి యోగి రమేష్ యాదగిరి. ప్రస్తుత యువత చదువుకునే రోజుల్లో చేసే టేకీటీజీ ప్రేమలు, ఎంజాయ్ చేయటం, ఆ తర్వాత మరొకరిని పెళ్లిచేసుకోవటం వంటి అంశాలను ఇతివృత్తంగా చేసుకుని తెరకెక్కుతున్న చిత్రమిది.



మూడోసారి డబ్ల్యుటిసి ఫైనల్‌కు చేరడంలో

టీమిండియా విఫలం

● ర్యాంకింగ్స్‌లోనూ పతనమే ● ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల



ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ రేసులో బుమ్రా

టీమిండియా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు రేసులో నిలిచాడు. డిసెంబర్-2024 నెలకు గాను అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) అవార్డు రేసులో ఉన్న ఆటగాళ్ల జాబితాను వెల్లడించింది. ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో 31ఏళ్ల బుమ్రా 14.22 సగటుతో 32వికెట్లు తీసాడు. తొలి మూడు టెస్ట్‌లు ముగిసేసరికి బుమ్రా 22 వికెట్లతో సత్తా చాటాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌ను టీమిండియా 1-3తో చేజార్చుకొని డబ్ల్యుటిసి 2025 ఫైనల్‌కు చేరడంలో విఫలమైన సంగతి తెలిసిందే. బుమ్రాతోపాటు ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ రేసులో పాట్ కమిన్స్ (ఆస్ట్రేలియా, డేన్ పీటర్సన్(దక్షిణాఫ్రికా) కూడా ఉన్నారు.

దుబాయ్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌ను కోల్పోయిన టీమిండియాకు మరో షాక్ తగిలింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత జట్టు మూడో స్థానానికి పడిపోయింది. టీమిండియా 2016 తర్వాత తొలిసారి మూడో స్థానానికి పడిపోవడం ఇదే తొలిసారి. ఇక పాకిస్తాన్‌తో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన దక్షిణాఫ్రికాజట్టు టీమిండియాను వెనక్కినెట్టి రెండో స్థానానికి ఎగబాకింది. భారత్‌తో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 3-1తో చేజిక్కించుకున్న ఆస్ట్రేలియా అగ్రస్థానంలో నిలువగా.. టాప్-2లో ఉంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ చేజిక్కించుకున్న ఆస్ట్రేలియా రేటింగ్ పాయింట్లను గణనీయంగా పెంచుకుని అగ్రస్థానాన్ని పటిష్టం చేసుకుంది. తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఆసీస్ (126పాయింట్లు), దక్షిణాఫ్రికా(112), భారత్(109), ఇంగ్లాండ్(106), న్యూజిలాండ్(96) టాప్-5లో ఉన్నాయి. శ్రీలంక (87), పాకిస్తాన్(83), వెస్టిండీస్(75), బంగ్లాదేశ్ (65), ఐర్లాండ్(26) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

గత 8 టెస్టుల్లో ఒక్కటే విజయం..

టీమిండియా గత ఎనిమిది టెస్టుల్లో ఒక్క టెస్ట్‌లోనే విజయం సాధించింది. ఈ క్రమంలో వరుసగా ఆరు టెస్టుల్లో ఓడి ఒక టెస్ట్‌ను డ్రాగా ముగించింది. దీంతో వరుసగా రెండుసార్లు డబ్ల్యుటిసి ఫైనల్‌కు చేరిన టీమిండియా.. తొలిసారి ఫైనల్‌కు చేరడంలో విఫలమైంది. 2023-25 డబ్ల్యుటిసిలో భారత్ 19మ్యాచ్‌లు ఆడి 9విజయాలు, 8ఓటములు, 2డ్రాలు నమోదు చేసింది.

ప్రి క్వార్టర్స్‌కు త్రీసా-గాయత్రి

మలేషియా ఓపెన్



కౌలాలంపూర్: మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ మహిళా షట్లర్లు త్రీసా-గాయత్రి సత్తా చాటారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ పోటీలో భారత జంట గెలిచి ప్రి క్వార్టర్స్‌కు చేరారు. తొలిరౌండ్‌లో థాయ్ లాండ్‌కు చెందిన సుకిత్తా సువాఛా- ఓర్నీఛా జంటపై వరుససెట్లలో గెలిచారు. 6వ సీడ్‌గా బరిలోకి దిగిన త్రీసా-గాయత్రి 21-10, 21-10తో సునాయాంగా విజయం సాధించారు. ప్రి క్వార్టర్స్‌లో భారత జంట చైనాకు చెందిన హి-ఫన్-జియా, జియాన్ జంగ్‌లతో తలపడనున్నారు. బుధవారం నుంచి సింగిల్స్ పోటీలు ప్రారంభం కానున్నాయి. సింగిల్స్ బరిలో లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రాజ్‌వత్, అనుపమ ఉపాధ్యాయ, ఆకర్షీ కశ్యప్ తొలిరౌండ్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

21మందితో ఇండియన్ ఓపెన్ బరిలో...

2025 మూడో టోర్నీ యునెక్స్-సన్‌రైజ్ ఇండియా ఓపెన్ సూపర్-750 బరిలోకి భారత్ నుంచి 21 షట్లర్లు రేసులో ఉన్నారు. న్యూఢిల్లీ వేదికగా జనవరి 14నుంచి 19వరకు ఈ టోర్నీ జరగనుంది. టాప్‌సీడ్, ఒలింపిక్ ఛాంపియన్ విక్టర్ అక్సెల్సన్, మహిళల టాప్‌సీడ్ క్రీడాకారిణి అన్-సె-యంగ్ కూడా బరిలోకి దిగుతున్నారు.

ప్రి క్వార్టర్స్‌కు ఆంధ్ర, మధ్యప్రదేశ్

అండర్-19 బాలికల జాతీయ వాలీబాల్ టోర్నీ



విజయవాడ: పిబి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కాలేజీలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ అండర్-19 బాలికల జాతీయ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌జిఎఫ్‌ఏపి), కష్ణాజిల్లా అండర్-19 విభాగం సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నాయి. గ్రూప్-హెచ్‌లో ఉన్న ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ 25-12, 25-11, 25-13తో చండీఘడ్‌పై విజయం సాధించగా.. పంజాబ్ చేతిలో తెలంగాణ 25-18, 25-15, 25-18తో ఓటమిపాలైంది. దీంతో తెలంగాణ జట్టు ఆడిన మూడు మ్యాచుల్లో కేవలం ఒక్క మ్యాచ్‌లో నెగ్గి, రెండింటిలో ఓటమి పాలై నాకౌట్‌కు చేరడంలో విఫలమైంది. గ్రూప్-హెచ్‌లో ఆంధ్ర, మధ్యప్రదేశ్ జట్లు టాప్-2లో నిలిచి నాకౌట్‌కు చేరాయి. అలాగే ఢిల్లీ, కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర. తమిళనాడు, సిఐఎస్‌సిఈ జట్లు కూడా ప్రి క్వార్టర్స్‌కు చేరాయి. బుధవారం నుంచి నాకౌట్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

శ్రీతేజ్‌కు అల్లు అర్జున్ పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను నటుడు అల్లు అర్జున్ పరామర్శించారు. తెలంగాణ ఎఫ్‌డిసి చైర్మన్, నిర్మాత దిల్ రాజుతో కలిసి మంగళవారం ఆస్పత్రికి వచ్చిన అల్లు అర్జున్.. సుమారు 20 నిమిషాల పాటు ఆస్పత్రిలో ఉన్నారు. వైద్యులతో మాట్లాడి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలుడి తండ్రి భాస్కర్‌తోనూ మాట్లాడారు. మరోవైపు ఆస్పత్రి వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

గ్రీన్‌కో కార్యాలయాల్లో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో, కృష్ణా ప్రతినిధి

ఫార్ములా ఇ-రేసు వ్యవహారంలో గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం తెరపైకి రావడంతో మంగళవారం గ్రీన్‌కో కార్యాలయాల్లో ఎసిబి అధికారులు సోదాలు చేపట్టారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ కార్యాలయంలో, కృష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న గ్రీన్‌కో ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్ కార్యాలయాల్లో సోదాలు చేశారు. ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి తొమ్మిది మంది ఎసిబి అధికారుల బృందం మచిలీపట్నంలోని గ్రీన్‌కో కార్యాలయానికి చేరుకుంది. రాత్రి ఎనిమిది గంటల వరకు సోదాలు నిర్వహించింది. సోదాలు ముగిసేవరకూ ఎవ్వరిని లోపలకు అనుమతించలేదు. లోపలవారిని బయటకు రావడానికి అనుమతించలేదు. సోదాలు ముగిసిన తర్వాత ఎటువంటి వివరణ ఇవ్వకుండానే వెనుతిరిగి వెళ్లిపోయారు. మీడియాతో గ్రీన్‌కో ఎజిఎం సురేష్ మాట్లాడుతూ.. బందరులోని సంస్థ కార్యాలయాన్ని గెస్ట్ హౌస్‌గా ఉపయోగించుకుంటున్నామని, ఎసిబి అధికారులకు తెలిపామన్నారు. ఎసిబి అధికారులు కోరిన విధంగా ఇంటి పన్ను, కరెంటు బిల్లులను అందించామన్నారు. మాదాపూర్ కార్యాలయంలోని రికార్డులు, కంప్యూటర్ హార్డ్‌డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. అకౌంట్స్ సిబ్బందిని విచారించారు. ఫార్ములా-ఇ ఒప్పందానికి ముందు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో భారాసకు రూ.41 కోట్లు ఇవ్వడంపై ఎసిబి దృష్టి సారించింది. 2022 అక్టోబరు 25న రేసు నిర్వహణకు సంబంధించి త్రైపాక్షిక ఒప్పందం జరగగా.. అంతకు ముందు అదే ఏడాది ఏప్రిల్‌లో రూ.31 కోట్లు, అక్టోబరులో రూ.10 కోట్లు గ్రీన్‌కో అనుబంధ సంస్థలు ఎలక్టోరల్ బాండ్లను సమకూర్చడంపై ఎసిబి ఆరా తీస్తోంది. మరోవైపు ఫార్ములా-ఇ కేసులో విచారణకు రావాలని కెటిఆర్‌కు ఎసిబి రెండోసారి నోటీసులు ఇచ్చింది.

నేడు విశాఖకు మోడీ

(మూడవ పేజీ తరువాయి)

ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.

రోడ్ షో, బహిరంగ సభ ఇలా..

బుధవారం సాయంత్రం 4.45 నుంచి 5.30 గంటల వరకూ నగరంలోని వెంకటాద్రి వంటిల్లు నుంచి ఎయు ఇంజనీరింగ్ కళాశాల మైదానం వరకూ మోడీ రోడ్డు షో నిర్వహించ నున్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. ప్రధాని సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం మూడు లక్షల మందిని సభకు తరలించే దిశగా కసరత్తు చేస్తోంది.

విశాఖ నగరంలో ప్రజల రాకపోకలపై ఇప్పటికే ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రధాని విశాఖ పర్యటన కోసం ప్రభుత్వం నాలుగు వేల మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసింది. 35 మంది ఐపిఎస్‌ల పర్యవేక్షణలో ఏర్పాట్లు సాగుతున్నాయి. మూడు లక్షల మందిని సమీకరించ డానికి టిడిపి కూటమి నాయకులు ప్రశ్నిస్తున్నారు.

దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ హబ్

విశాఖ నగరానికి 50 కిలోమీటర్ల దూరంలోగల అనకాపల్లి జిల్లా పూడిమడకలో 1,600 ఎకరాల విస్తీర్ణంలో రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడితో హైడ్రోజన్ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. నేషనల్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్‌జిఇఎల్) నేతృత్వంలో విశాఖ ఎన్‌టిపిసి ఆధ్వర్యాన దీనిని ఏర్పాటు చేస్తున్నారు. దేశంలోనే ఇది మొట్టమొదటిది. నీరు, గాలితో గ్రీన్ ఎనర్జీ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఆసియా ఖండంలోనే అనువైన ప్రదేశంగా విశాఖ-పూడిమడక ప్రదేశం ఉన్నట్లు కేంద్రం గుర్తించింది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని చెప్తున్నారు. రోజుకు 1,500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌తోపాటు 4,500 టన్నుల గ్రీన్ అమ్మోనియా, 1,500 టన్నుల గ్రీన్ మిథనాల్, 1,500 టన్నుల సస్టెయినబుల్ ఏవియేషన్ ఫ్యూయెల్ (ఎస్ఎఎఫ్) లేదా గ్రీన్ యూరియాను ఉత్పత్తి చేయనున్నారు ఎన్‌టిపిసికి చెందిన రీసెర్చి అండ్ డవలప్‌మెంట్ (ఆర్అండ్‌డి) సెంటర్ ఈ హైడ్రోజన్ ఉత్పత్తి ప్రయత్నానికి నాంది పలికింది. థర్మల్ ప్లాంట్ అయితే కేవలం గంటకు లక్ష లీటర్లే తీసుకుని రీ సైక్లింగ్ చేసి సముద్రంలోకి అంతే మొత్తంలో వదులుతారు. గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ హైడ్రోజన్ ఉత్పత్తికి గంటకు లక్షల లీటర్ల చొప్పున సముద్రం నుంచి తీసుకుని అదే గంటలో అంతే మొత్తంలో వేడి నీటిని సముద్రంలోకి వదులుతారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు : సిఎస్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంగళవారం మరోసారి రాష్ట్ర సచివాలయం నుండి ఆయన వీడియో సమావేశం ద్వారా సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటన ఏర్పాట్లలో ఏ చిన్న పొరపాటుకూ ఆస్కారం లేని రీతిలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాని వర్చువల్‌గా సుమారు 20 వరకూ వివిధ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని, సంబంధిత శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లనూ పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఈ వీడియో సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న డిజిపి ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు సంబంధించి ఎస్‌పిజి సమన్వయంతో పోలీస్ శాఖ తరఫున కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, ఇంటిలిజెన్స్ ఐజి పిహెచ్‌డి రామకృష్ణ, వర్చువల్ పలు శాఖల కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండన

(మూడవ పేజీ తరువాయి)



అప్పలరాజును గృహ నిర్బంధం చేసిన పోలీసులు

ప్రయివేటీకరణ జరగకుండా చూస్తామని, నక్కపల్లిలో భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తా మని చెప్పి నేడు ఆ సమస్యలను పరిష్కరించకుండా సిపిఎం నాయకులను గృహ నిర్బంధించడం ప్రజాస్వామ్య హక్కులను ఖూనీ చేయడమేనన్నారు. ఎటువంటి అరెస్టులు గృహనిర్బంధా లు ఉండవని గతంలో మంత్రి లోకేష్ గొప్పగా ప్రకటించి, నేడు సిపిఎం నాయకులను నిర్బంధించడాన్ని బట్టి వారి మాటలకు చేతలకు ఎంతో తేడా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చేయడం లేదని, నక్కపల్లిలో బల్క్‌డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేయడం లేదని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు.సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఎస్.రాయవరం మండలం ధర్మవరంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము, మండల కమిటీ సభ్యులు సోమునాయుడు, కె.కోటపాడు మండల నాయకులు ఎర్రా దేముడు, కశింకోట మండల నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డిడి.వరలక్ష్మి, నక్కపల్లిలో మరో ముగ్గురు నాయకులను గృహ నిర్బంధంలో ఉంచారు. ప్రభుత్వ, పోలీసు తీరును సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. లోకనాథం ఖండించారు.



ఎపిఇఆర్‌సి విచారణలో మాట్లాడుతున్న బాబూరావు

దొడ్డిదారిన భారాలు మోపొద్దు

(మూడవ పేజీ తరువాయి)

ఎం వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ విధానాలను అనుసరించడం వల్ల ప్రజలపై భారాలు పడుతున్నాయన్నారు. కేంద్రం ఆదేశాల మేరకే పునరుత్పాదక విద్యుత్ పేరుతో అవసరం లేకపోయినా డిస్కమ్‌లు ప్రైవేట్ కంపెనీల నుంచి ఒప్పందాలు చేసుకుంటున్నాయని చెప్పారు. 2025-26లో కూడా డిస్కమ్‌లు ప్రతిపాదించిన దానికంటే మిగులు విద్యుత్ ఉంటుందన్నారు. ప్రభుత్వం చేసే తప్పులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన కమిషన్లు ఆ పనిచేయడం లేదన్నారు. విద్యుత్‌రంగ నిపుణులు పున్నారావు మాట్లాడుతూ విద్యుత్ భారాలు వల్ల ఉత్తరాంధ్రలో ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడి 30 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. 2029 నాటికి రాష్ట్రంలో 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ (ఆర్ఇ) వస్తే వినియోగదారుల కష్టాలు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పగటిపూట థర్మల్ ఉత్పత్తి తగ్గించడం వల్ల యూనిట్ ధర పెరగడంతోపాటు ప్లాంట్లు త్వరగా మరమ్మతులకు గురవుతాయని చెప్పారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడానికి నిరసనగా రైతు సంఘం నాయకులు సిహెచ్ వేణుగోపాల్‌రావు తలకిందులుగా నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు డిస్కంల ప్రతిపాదనలను ఆయా సిఎండిలు కె సంతోషరావు (ఎపిఎస్‌పిడిసిఎల్), రవి సుభాష్‌పట్టాన్‌శెట్టి (ఎపిసిపిడిసిఎల్) ఐ పృథ్వీతేజ్ (ఎపిఇపిడిసిఎల్) చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎపిఇఆర్‌సి సభ్యులు వెంకటరామిరెడ్డి, కార్యదర్శి పి కృష్ణ, ట్రాన్స్‌కో జెఎండి కీర్తి చేకూరి తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నాని ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

రేషన్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసు విచారణ ఈ నెల 20కి వాయిదా పడింది. అప్పటి వరకు ఎటువంటి చర్యలూ తీసుకోవద్దని పోలీసులకు హైకోర్టు సూచించింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సోమ, మంగళవారాల్లో వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి వాదనలను వినేందుకు ఈ నెల 20కి వాయిదా వేశారు.

స్వాధీనపర్చుకున్న ఆయుధాలు ఇచ్చేయండి

ప్రజాశక్తి-అమరావతి : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పుడు పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను తిరిగి వారికి వెనక్కి ఇవ్వాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వారిద్దరూ లైసెన్స్ నిబంధనలకు ఉల్లంఘించి ఆ ఆయుధాలను వాడుతారనే ఆధారాలు ల్లేవంది. ఎన్నికల సమయంలో తమ నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు తిరిగి ఇవ్వలేదంటూ వారిద్దరూ దాఖలు చేసిన కేసులో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

सत्यमेव जयते
Government of India

భారతదేశ ఆర్థిక వృద్ధి
ఇంజిన్‌గా ఆంధ్రప్రదేశ్





రూ॥ 2 లక్షల కోట్ల పైగా విలువైన

ఇంధనం, రైల్వే, రోడ్లు, ఫార్మాస్యూటికల్స్ & ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్‌ల శంకుస్థాపన, ప్రారంభోత్సవం మరియు దేశానికి అంకితం చేయనున్న

గౌరవ భారత ప్రధాన మంత్రి
శ్రీ నరేంద్ర మోదీ

బుధవారం, 8 జనవరి, 2025 | సా. గం॥ 17:30 | విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్

శంకుస్థాపన

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్, పూడిమడక
ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ హైడ్రోజన్ పర్యావరణానికి కేంద్రంగా ఏర్పరుచుకుంటూ, సుస్థిర పరిశ్రమల వృద్ధిని ప్రోత్సహించడం

సౌత్ కోస్ట్ రైల్వే (ఎస్‌సీఓఆర్) ప్రధాన కార్యాలయం
ఆంధ్రప్రదేశ్ మరియు పొరుగు రాష్ట్రాలకు కేంద్రీకృత పరిపాలనతో మెరుగైన రైల్వే ఇన్ఫ్రా

రైల్వే లైన్ల డబ్లింగ్ - 3 ప్రాజెక్ట్‌లు - మొత్తం 465 కి.మీ.
రైల్వే లైన్ల నిర్మాణం - 3 ప్రాజెక్ట్‌లు - మొత్తం 48 కి.మీ.
రోడ్డు విస్తరణ 2-లేన్ & 4-లేన్ - 7 ప్రాజెక్ట్‌లు - మొత్తం 294 కి.మీ.
గ్రీన్‌ఫీల్డ్ బైపాస్ నిర్మాణం - 3 ప్రాజెక్ట్‌లు - మొత్తం 26 కి.మీ.
ఆంధ్రప్రదేశ్ మరియు పొరుగు రాష్ట్రాల్లో ప్రాంతీయ అనుసంధానానికి ప్రోత్సాహం

నక్కపల్లి, అనకాపల్లి వద్ద బల్క్ డ్రగ్ పార్క్ అభివృద్ధి
సరసమైన, అధిక నాణ్యత గల మందులను అందించడం మరియు ఈ రంగంలో భారతదేశాన్ని స్వావలంబనగా మార్చడం

కృష్ణపట్నం ఇండస్ట్రియల్ ఏరియా - క్రిస్ సిటీ
ఉపాధి అవకాశాలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రాంతీయ ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం

ప్రారంభోత్సవం

రోడ్డు విస్తరణ 2-లేన్ & 4-లేన్ - 5 ప్రాజెక్ట్‌లు - మొత్తం 210 కి.మీ.
గ్రీన్‌ఫీల్డ్ బైపాస్ నిర్మాణం - 2 ప్రాజెక్ట్‌లు - మొత్తం 24 కి.మీ.

దేశానికి అంకితం

రైల్వే లైన్ల డబ్లింగ్ - 3 ప్రాజెక్ట్‌లు - మొత్తం 323 కి.మీ.

బలమైన ప్రాంతీయ అనుసంధానం | **సామాజిక ఆర్థిక అభివృద్ధి పెంపొందించడం** | **యువతకు ఉపాధి కల్పన**

గౌరవప్రదమైన వీరి సమక్షంలో

శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్
గవర్నర్, ఆంధ్రప్రదేశ్

శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు
ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్

శ్రీ కె. పవన్ కళ్యాణ్
ఉప ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్

శ్రీ నితిన్ జైరామ్ గడ్కరీ
కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి

శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా
కేంద్ర రసాయనాలు, ఎరువులు, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి

శ్రీ మనోహర్ లాల్
కేంద్ర విద్యుత్, హౌసింగ్ మరియు అర్బన్ అఫైర్స్ మంత్రి

శ్రీ పీయూష్ గోయల్
కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రి

శ్రీ ప్రహ్లాద్ జోషి
కేంద్ర నూతన పునరుత్పాదక ఇంధన, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ మంత్రి

శ్రీ అశ్విని వైష్ణవ్
కేంద్ర రైల్వే, సమాచార, బ్రాడ్‌కాస్టింగ్, ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి

శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు
కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి

డా. చంద్ర శేఖర్ పెమ్మసాని
కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు సమాచార ప్రసారాల శాఖ సహాయ మంత్రి

శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ
కేంద్ర భారీ పరిశ్రమలు మరియు ఉక్కు శాఖ సహాయ మంత్రి

DD NEWS DD న్యూస్ లో ప్రత్యక్ష ప్రసారం వీక్షించండి